విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ, పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com

ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

తెలుగు జాతీయ దిన పత్రిక

TELTEL/2012/47103

సంపుటి : 12 సంచిక :95 నల్గొండ ఆదివారం 29-06-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ పేజీలు : 4 వెల : రూ.1/-


## పివి జయంతి సందర్భంగా సీఎం తదితరుల నివాళి



హైదరాబాద్,జూన్28: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని పీవీ ఘాట్ వద్ద పలువురు కాంగ్రెస్ నేతలు నివాళి అర్పించారు. భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవీ నరసింహారావు సేవలను గుర్తు చేసుకున్నారు. బహుభాషాకోవిదుడిగా, రచయితగా, ఆర్థిక సంస్కరణల పితామహుడిగా ఆయన దేశానికి ఎనలేని సేవలను అందించారని కొనియాడారు. దేశాన్ని ప్రగతిపథంలో నడిపించడంలో పీవీ పాత్ర ఎనలేనిదన్నారు. సీఎంతో పాటు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేంద్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి.. పీవీకి నివాళులు అర్పించారు. మాజీ ప్రధాని పీవీ నరసింహ రావు జయంతి సందర్భంగా పీవీ ఘాట్‌లో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రధానిగా, ముఖ్యమంత్రిగా పీవీ దేశంలో రాష్ట్రంలో అనేక సంస్కరణలు తెచ్చారన్నారు. ఆర్థిక సంస్కరణల తో భారత దేశాన్ని ప్రపంచంలో బలమైన ఆర్థిక శక్తిగా నిలబెట్టారని గుర్తుచేశారు. భూ సంస్కరణలతో సమాజంలో సమానత్వానికి కృషి చేశారని తెలిపారు. భూ సంస్కరణలో భాగంగా కాంగ్రెస్ ఇప్పటి వరకు 24 లక్షల ఎకరాలకు పైగా భూమిని పేదలకు పంచిందన్నారు. తెలంగాణలో గత పదేళ్ల పాలించిన ప్రభుత్వం ధరణి తెచ్చి పేదలను ఇబ్బంది పెట్టిందని విమర్శించారు. పేదల హక్కులను కాపాడడానికి భూభారతి చట్టాన్ని తెచ్చామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. విద్యారంగం బలోపేతం పీవీతోనే సాధ్యమైందన్నారు. దేశ ఆర్థిక రంగంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. ఆయన అనేక సంస్కరణలు తెచ్చారని వివరించారు. కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, సీనియర్ నేత వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధు ద్వారా 4,415 మంది భారతీయుల్ని తరలించాం

న్యూఢిల్లీ, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య వార్ కారణంగా అక్కడ చిక్కుకున్న భారతీయుల్ని రప్పించేందుకు కేంద్రం 'ఆపరేషన్ సింధు' చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ఆపరేషన్ ద్వారా ఇజ్రాయెల్, ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయుల్ని స్వదేశానికి చేర్చింది. పొరుగు దేశాలకు చెందిన పౌరులకు కూడా ఆపరేషన్ సింధు ద్వారా సాయం అందించింది. జూన్ 18న ప్రారంభమైన ఈ ఆపరేషన్ ద్వారా ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల నుంచి దాదాపు 4,415 మందికిపైగా భారతీయుల్ని స్వదేశానికి చేర్చినట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది.'19 ప్రత్యేక విమానాల ద్వారా ఇప్పటి వరకూ మొత్తం 4,415 మంది భారతీయ పౌరులను తరలించాం. అందులో ఇరాన్ నుంచి 3,597 మంది, ఇజ్రాయెల్ నుంచి 818 మంది ఉన్నారు. 14 మంది ఓసీఐ కార్డుదారులు, తొమ్మిది మంది నేపాలీలు, నలుగురు శ్రీలంక జాతీయులు ఉన్నారు. తరలించిన పౌరుల్లో 1,500 మందికిపైగా మహిళలు, 500 మంది చిన్నారులు ఉన్నారు' అని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇరాన్‌లోని టెహ్రాన్, యెరెవాన్, అష్గాబాత్‌లో చిక్కుకుపోయిన వారిని ఆర్మేనియా, తుర్క్‌మెనిస్తాన్ సరిహద్దు క్రాసింగ్ ద్వారా తరలించినట్లు పేర్కొంది. భారతీయుల కోసం తన గగనతలాన్ని తెరిచిన ఇరాన్‌కు విదేశాంగ శాఖ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపింది. జూన్ 18 నుంచి 26 వరకూ 15 ప్రత్యేక విమానాల ద్వారా యెరెవాన్, అష్గాబాత్, మష్హద్ నుంచి 3,597 మంది భారత పౌరులను స్వదేశానికి తీసుకొచ్చినట్లు విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఇక



ఆపరేషన్ సింధులో భాగంగా ఇజ్రాయెల్‌లోని భారతీయుల తరలింపు జూన్ 23న నుంచి ప్రారంభమైనట్లు వెల్లడించింది. టెల్ అవీవ్, రామల్లా, అమ్మన్, కైరో నుంచి జోర్డాన్, ఈజిప్ట్ సరిహద్దుల మీదుగా భారత పౌరులను తరలించినట్లు తెలిపింది. విద్యార్థులు, కార్మికులు, నిపుణులు మొత్తం 818 మంది భారతీయులను ఇజ్రాయెల్ నుంచి తరలించినట్లు పేర్కొంది. జూన్ 22 నుంచి 25 వరకూ మూడు ఐఏఎఫ్ సీ-17 విమానాలు సహా నాలుగు ప్రత్యేక విమానాల ద్వారా తరలించినట్లు వివరించింది. మరోవైపు రెండు దేశాల మధ్య కాల్పుల విరమణతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చల్లారాయి. దీంతో ప్రస్తుతం ఈ ఆపరేషన్‌కు బ్రేక్ పడింది.

## అమెరికాకు ఇరాన్ షాక్ ...

టెహ్రాన్:పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా జరిపిన భారీ వైమానిక దాడుల నుంచి ఇరాన్ వేగంగా కోలుకునే ప్రయత్నాలు ప్రారంభించింది. తమ అణు కేంద్రంపై బాంబుల వర్షం కురిపించిన వారం తిరగకముందే, దెబ్బతిన్న ఫోర్డో ఇంధన శుద్ధి కర్మాగారం వద్ద మరమ్మతు పనులను ముమ్మరం చేసింది. అమెరికా దాడుల తర్వాత, ఇరాన్ అణు కేంద్రంలో సెంట్రిఫ్యూజ్‌లు పనిచేయడం ఆగిపోయిందని, కొంత భౌతిక నష్టం జరిగిందని నివేదికలు ఉన్నాయి. అయితే, ఇరాన్ ఈ కేంద్రంలో యురేనియం శుద్ధి చేయడాన్ని నిలిపివేసింది. ఈ నేపథ్యంలోనే మాక్సర్ టెక్నాలజీస్ విడుదల చేసిన తాజా శాటిలైట్ చిత్రాలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.ఫోర్డో అణు కేంద్రం ఉన్న పర్వత ప్రాంతంలో నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నట్టు శాటిలైట్ చిత్రాలు చూపిస్తున్నాయి. అమెరికా దాడులతో ఏర్పడిన శిథిలాలను తొలగించేందుకు ఎక్స్‌కవేటర్లు, బుల్డోజర్లను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. ముఖ్యంగా, అమెరికాకు చెందిన శక్తివంతమైన జీబీయూ-57 'బంకర్ బస్టర్' బాంబులు లక్ష్యంగా చేసుకున్న సొరంగ మార్గాల వద్ద ఈ పనులు కేంద్రీకృతమయ్యాయి. భూగర్భంలో ఉన్న అణు కేంద్రానికి ఈ మార్గాలు అత్యంత కీలకమైనవి.ఇంతేకాకుండా, పర్వతంపైకి కొత్తగా యాక్సెస్ రోడ్లను నిర్మిస్తున్న ఆనవాళ్లు కూడా కనిపిస్తున్నాయి. దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను పునరుద్ధరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈ చిత్రాల ద్వారా



స్పష్టమవుతోంది. దాడుల వల్ల లోపల జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి, పునరుద్ధరణ పనులు చేపట్టడానికి ఇరాన్ అధికారులు ప్రయత్నిస్తున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ మరమ్మతు పనులపై ఇరాన్ ప్రభుత్వం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు.కాగా, గత వారాంతంలో పశ్చిమాసియాలో ఘర్షణలను తీవ్రతరం చేస్తూ అమెరికా.. ఇరాన్‌లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అనే మూడు కీలక అణు కేంద్రాలపై వైమానిక దాడులు జరిపిన విషయం తెలిసిందే. ఈ దాడుల తర్వాత ఇరాన్ ఇంత వేగంగా స్పందించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారింది.

## పివి గురించి ఎంత చెప్పకున్నా తక్కువే



హైదరాబాద్,జూన్28: మాజీ ప్రధాని పీవీ నరసింహ రావు జయంతి సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ నివాళులు అర్పించారు. సంస్కరణశీలి, బహుభాషా కోవిదుడు, కవి, ఆర్థికవేత్త, రాజనీతిజ్ఞుడు, నిత్య విద్యార్థి... ఇలా భారతరత్న పీవీ నరసింహారావు గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే అని అన్నారు. భారత ప్రధానిగా ఆర్థిక సంస్కరణలను తెచ్చి దేశాన్ని భారీ సంక్షోభం నుంచి గట్టెక్కించిన మహా మేధావి పీవీ అని కొనియాడారు. తన సొంత భూమిని ప్రభుత్వానికి అప్పగించి దేశంలో కీలకమైన భూసంస్కరణలను ప్రారంభించిన మహనీయుడు పీవీ అని అన్నారు. గురుకుల విద్యాలయాలకు అంకురార్పణ చేసి విద్యారంగానికి ఎనలేని సేవలు చేసిన పీవీ నరసింహారావు శత జయంతి ఉత్సవాలను కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ఘనంగా నిర్వహించిందని గుర్తు చేసుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరు పెట్టిందని.. నెక్లెస్ రోడ్‌కు పీవీ మార్గ్ అని పేరు పెట్టడమే కాకుండా.. పీవీ ఎత్తయిన విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. పీవీ నరసింహారావుకు భారతరత్న ఇవ్వాలని కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రానికి తీర్మానం పంపిందన్నారు. పీవీ తనయ సురభి వాణీదేవికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి గౌరవించిందని చెప్పుకొచ్చారు. నవ భారత నిర్మాత పీవీ మన తెలంగాణ గడ్డపై పుట్టడం మనందరికీ గర్వకారణమన్నారు. పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

## గిగ్ వర్కర్ల కోసం బోర్డు ఏర్పాటు యోచన



హైదరాబాద్,జూన్28, రాష్ట్రంలో గిగ్ వర్కర్లకు ఉత్తమ పాలసీని తీసుకొస్తామని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. తెలంగాణ గిగ్ వర్కర్ పాలసీ దేశానికే రోల్ మోడల్ అయ్యేలా చూస్తామని ఆయన తెలిపారు. త్వరలోనే గిగ్ వర్కర్లకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఓ బోర్డును ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తోందని ఆయన అన్నారు. రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో ఇప్పటికే గిగ్ వర్కర్లకు ప్రత్యేకంగా ఓ చట్టాన్ని రూపొందించారని ఆయన గుర్తు చేశారు. త్వరలో తెలంగాణలో కూడా అదే చేయబోతున్నాయని మంత్రి వివేక్ స్పష్టం చేశారు. శుక్రవా రం గి గ్ వర్కర్ల సమస్యలపై సంబంధిత అధికారులతో సచివాలయంలో మంత్రి వివేక్ సమీక్ష స మావేశం నిర్వహించారు. గిగ్ వర్కర్ల సమస్యలు, వారి నుంచి వచ్చిన సూచనల గురించి అధికారులతో మంత్రి చర్చించారు. అనంతరం ఆయన మీ డియాతో మాట్లాడుతూ గిగ్ కార్మికులు చాలా స మస్యలు ఎదుర్కొంటున్నారని వాళ్లకు హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో గిగ్ వర్కర్లకు రిజిస్ట్రేషన్ సిస్టమ్‌ను తీసుకొస్తామని ఆయన చెప్పారు. యాజమాన్యాలు, గిగ్ వర్కర్ల నుంచి 66 సూచనలు, సలహాలు వచ్చాయని వాటిపై చర్చించి ఎలాంటి సాయం చేయాలన్న దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని మంత్రి వివేక్ పేర్కొన్నారు. గిగ్ వర్కర్ల సమస్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ భారత్ సమ్మిట్‌లో మాట్లాడారని అలాగే గిగ్ వర్కర్లకు న్యాయం చేయాలని సూచించారని ఆయన తెలిపారు. గిగ్ వర్కర్ల సమస్యలపై కేబినెట్‌లో చర్చిస్తామని ఆయన పేర్కొన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే గిగ్ వర్కర్లతో మాట్లాడారని మంత్రి వివేక్ గుర్తు చేశారు. గిగ్ వర్కర్ల పాలసీపై కేబినెట్‌లో చర్చించి అసెంబ్లీలో చట్టం తీసుకొస్తామని ఆయన తెలిపారు. గిగ్ వర్కర్లకు కనీస వేతనం వచ్చేలా కృషి చేస్తామని మంత్రి వివేక్ హామీ ఇచ్చారు. రాష్ట్రంలో నాలుగున్నర లక్షల గిగ్ వర్కర్లు ఉన్నారని, కొత్త యాక్ట్ వాళ్లకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త యాక్ట్‌లో భాగంగా 2 శాతం సెస్ వినియోగదారులు లేదా కంపెనీ యాజమాన్యం భరించాలన్న ప్రతిపాదనను బిల్లులో పొందుపరుస్తామని మంత్రి వివేక్ పేర్కొన్నారు.

## విద్యార్థులు,నిరుద్యోగులతో మాజీ మంత్రి హరీశ్‌రావు భేటీ

హైదరాబాద్ : తెలంగాణ భవన్‌లో విద్యార్థులు, నిరుద్యోగులతో మాజీ మంత్రి హరీశ్‌రావు భేటీ అయ్యారు. భేటీ అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి, అశోక్ నగర్ నుంచి, వివిధ జిల్లాల నుంచి నిరుద్యోగ యువత తరలివచ్చి ఛలో సెక్రెటేరియట్ కార్యక్రమానికి మద్దతివ్వాలని కోరారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసేదాకా అసెంబ్లీ లోపల, బయట బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హరీశ్‌రావు చెప్పారు. రాష్ట్రపతి ఉత్తర్వులను సవరించి 95 శాతం ఉద్యోగాలు స్థానికులకు వచ్చేలా బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ కృషి చేశారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షా 62 వేల ఉద్యోగాలు ఇచ్చిందని తెలిపారు. మేం ఉద్యోగాలు ఇవ్వలేదనిరేవంత్ రెడ్డి ప్రభుత్వం గోబెల్స్ ప్రచారం చేస్తున్నదని అన్నారు. తాము గట్టిగా ప్రశ్నిస్తేనే రేవంత్ రెడ్డి అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ విడుదల చేశారని చెప్పారు. నాడు జాబ్ క్యాలెండర్ ప్రకటించిన ప్రభుత్వం వెంటనే సభలో చర్చ పెట్టకుండా వాయిదా వేసుకుని పారిపోయిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. జాబ్ క్యాలెండర్‌లో చెప్పిన విధంగా నోటిఫికేషన్‌లు ఇవ్వలేదని విమర్శించారు. ఎస్పీడీసీఎల్, ఫారెస్ట్, గ్రూప్స్, డీఎస్సీ, పోలీస్ ఇలా అన్ని శాఖల్లో పోస్టులు భర్తీ చేస్తామని జాబ్ క్యాలెండర్‌లో చెప్పారని ఆయన గుర్తుచేశారు. కానీ ఇంతవరకు ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదని, ఇది దగా క్యాలెండర్ అని మండిపడ్డారు.మెగా డీఎస్సీ దగా డీఎస్సీ అయ్యిందని హరీశ్‌రావు విమర్శించారు. నెలల తరబడి విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారని, 20 నెలలు కావొస్తున్నా రేవంత్ సర్కారు జాబ్ నోటిఫికేషన్‌లు ఇవ్వలేదని అన్నారు. రేవంత్ సర్కారు తీరు ఏరు దాటేదాక ఓడ మల్లన్న, ఏరు దాటినంక బోడి మల్లన్న అన్న తీరుగా ఉందని ఎద్దేవా చేశారు. 20 నెలల్లో రేవంత్ ఇచ్చిన ఉద్యోగాలు 12 వేలు కూడా దాటలేదన్నారు. రేవంత్ రెడ్డి యువతను దారుణంగా మోసం చేసిండని ఆరోపించారు.తాము పదేళ్లలో ఏడాదికి సగటున 16 వేల ఉద్యోగాల చొప్పున ఇచ్చామని, రేవంత్ సర్కారు రెండేళ్లుగా మా సగటులో సగం కూడా ఇవ్వలేదని హరీశ్‌రావు అన్నారు. రేవంత్ నోటిఫికేషన్‌లు ఇవ్వ చేతగాక అబద్దాలు మాట్లాడుతున్నడని విమర్శించారు. ప్రియాంకా గాంధీ సరూర్ నగర్ స్టేడియంలో మీటింగ్ పెట్టి యూత్ డిక్లరేషన్ చేశారని, ఇందిరాగాంధీ మనవరాలుగా మాటిస్తున్నానని చెప్పారని, ఇప్పుడు ప్రియాంకా గాంధీ ఎక్కడున్నారని ప్రశ్నించారు.నోటిఫికేషన్లు, ఉద్యోగాలు ఏమయ్యాయని రేవంత్ రెడ్డిని ప్రియాంకా గాంధీ ఎందుకు ప్రశ్నించడం లేదని హరీశ్‌రావు మండిపడ్డారు. యూత్ డిక్లరేషన్‌లోని ఐదు అంశాల్లో ఒక్కటి కూడా అమలు కాలేదని విమర్శించారు. అమరుల కుటుంబాలకు నెలకు రూ.25 వేల పించన్, రెండు లక్షల ఉద్యోగాలు, అమ్మాయిలకు స్కూటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. యూత్ డిక్లరేషన్ దిక్కు లేకుండా పోయిందన్నారు.జీవో 29 రద్దుచేసి ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నియామకాల్లో దగా చేశారని విమర్శించారు.రాహుల్ గాంధీ సెంట్రల్



లైబ్రరీ మెట్ల మీద కూర్చుని నిరుద్యోగులకు మాట ఇచ్చారని, రెండు లక్షల ఉద్యోగాలని చెప్పి మాట తప్పారని హరీశ్‌రావు అన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ ఇలా అందరూ నిరుద్యోగులను మోసం చేశారని, తక్షణం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి గోబెల్స్‌ను మించిపోయి మాట్లాడుతున్నడని, 60 వేల ఉద్యోగాలు ఎప్పుడిచ్చాడో శ్వేతపత్రం విడుదల చేయాలని అన్నారు.బల్మూరి వెంకట్, ఆకునూరి మురళి, రియాజ్‌లు మాయ మాటలు చెప్పి విద్యార్థులను రెచ్చగొట్టారని, ఇప్పుడు విద్యార్థులకు ఉద్యోగాలు రాలేదుగానీ, రెచ్చగొట్టిన వారికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని హరీశ్‌రావు అన్నారు. ఇప్పుడు ఆ ఉద్యోగుల దగ్గరికి వెళ్తే బెదిరిస్తున్నరని, అక్రమ కేసులు పెడుతున్నరని, ప్రశ్నించిన పిల్లల మీద దాడులు చేస్తున్నరని అన్నారు. నిరుద్యోగులు భయపడవద్దని, పోరాడాలని, మీకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుదని చెప్పారు.రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చేదాకా రేవంత్ రెడ్డిని వదిలిపెట్టమని హరీశ్‌రావు స్పష్టం చేశారు. మానుకోట నుంచి వచ్చిన శ్రీధర్‌కు ఫీజు రీయింబర్స్ మెంట్ రావడం లేదని చెప్పారు. రూ.3000 కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేస్తమన్నరని, ఒక్క రూపాయి కూడా ఇవ్వక కాలేజీలు మూతపడుతున్నాయని అన్నారు. ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీలు మూత పడుతున్నాయని చెప్పారు. బడా కాంట్రాక్టర్లకు రూ.12 వేల కోట్లు విడుదల చేశావని, పిల్లలు కమిషన్ ఇవ్వడం లేదని రీయింబర్స్ ఇవ్వడం లేదా.. అని ప్రశ్నించారు.బీఆర్ఎస్ హయాంలో రూ.20 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ ఇచ్చారని, కరోనా వచ్చినా, ఆర్థిక సమస్యలు వచ్చినా కేసీఆర్ రీయింబర్స్ ఆపలేదని.. ఎస్సీలు, బీసీలు, మైనార్టీల పిల్లలు అంటే ప్రభుత్వానికి ఎందుకు అంత చిన్నచూపని హరీశ్‌రావు నిలదీశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని, తక్షణం ఫీజు రీయింబర్స్ మెంట్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు లక్ష ఉద్యోగాలు ఇవ్వాలని, నాలుగు వేల భృతి ఇవ్వాలని, అమ్మాయిలకు స్కూటీలు ఇవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా హలో నిరుద్యోగి, చలో సెక్రెటేరియట్ పోస్టర్‌ను మాజీ మంత్రి ఆవిష్కరించారు.

## హుజురాబాద్‌లో పీవీ జయంతి వేడుకలు

హుజురాబాద్, జూన్ 28: పీవీ సేవా సమితి, అలయన్స్ క్లబ్ అధ్వర్యంలో భారత రత్న, భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు 104వజయంతి వేడుకలు శనివారం జరిగింది. పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్డులో పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మిఠాయిలు పంచిపెట్టారు . ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేశ ప్రధానిగా పీవీ నరసింహారావు దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ప్రపంచం గర్వించదగ్గ మేధావి మన ప్రాంత వాస్తవ్యుడు కావడం మనందరికీ గర్వకారణమని, వారి సేవలను గుర్తించి భారత పురస్కారం భారతరత్నతో ప్రభుత్వం వారిని గౌరవించిందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో పీవీ సేవా సమితి అధ్యక్షుడు తూము వెంకట రెడ్డి, ఎస్సై కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తోట రాజేంద్ర ప్రసాద్, సీనియర్ న్యాయవాది ముక్కెర రాజు, ఐఎంఏ డాక్టర్ రామలింగా రెడ్డి, అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు బీ మనోజ్, డాక్టర్



తొగరు విద్యాసాగర్, డాక్టర్ ప్రదీప్ రావు, ఎస్సై బండ సంపత్ రెడ్డి, పీడీ రాజి రెడ్డి, న్యాయవాది శ్రీనివాస్, పల్కల ఈశ్వర్ రెడ్డి, వేల్పుల రత్నం, కాసర్ల శ్రీహరి,

## సంపాదకీయం

ఆదివారం 29-06-2025

# ప్రజల ఎజెండాను విస్మరిస్తున్న పాలకులు !

ప్రజల ఆకాంక్షలకోసం పోరాడుతాం...ప్రజల సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తామని ఏర్పడ్డ ప్రాంతీయ పార్టీలు లక్ష్యాలను విస్మరించాయి. అధికారం రాకముందు ఒకలా, వచ్చిన తరవాత మరోలా వ్యవహరించి ప్రజలకు గుదిబండగా మారాయి. అధికారాన్ని కుటుంబ వ్యక్తుల చేతుల్లో కేంద్రీకృతం అయ్యేలా చూశాయి. అరాచక పాలనతో పాటు, విపరీతంగా అవినీతికి పాల్పడ్డాయి. ఇవాళ ప్రజలు కాంగ్రెస్ వైపో, బీజేపీ వైపో మళ్లుతున్నారంటే అందుకు ప్రధాన కారణం ప్రాంతీయ పార్టీల నేతల అవినీతి వ్యవహారాలే అని చెప్పు కోవాల్సిందే. ఈ క్రమంలో బిజెపి తన విధానాలు మార్చుకుంటే తప్ప మరింతగా నిలబడలేదు. ప్రజల్లో ఆదరణ పొందలేదు. ఉమ్మడి ఎపిలో బిఆర్ఎస్, వైకాపాలు ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపాయి. కానీ అప్పులు చేసి రాష్ట్రాలను కుప్ప చేసి వెళ్లాయి. ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ కూడా అప్పులపైనే కాలం వెళ్లదీస్తోంది. అప్పులు చేయకుండా ముందుకు అడుగు వేయలేని దుస్థితిలో రాష్ట్రాలు ఉన్నాయి. ఉచిత పథకాలు, పందేరాలతో రోజురోజుకు ఆర్థిక వ్యవస్థ క్షీణిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇదే పాలనగా, ఇదే అభివృద్ధిగా చూపుతున్నారు. మోడీ అవినీతి పాలన అంటూ బిజెపి ప్రచారం చేసుకుంటున్నా...ప్రజలకు ఒనగూరుతున్న ప్రయోజనాలు కానరావడం లేదు. నిత్యావసర ధరలు, నిరుద్యోగంపై చర్చించే దమ్ము లేదు. ఎన్‌డిఎ భాగస్వామ్య పార్టీలు ఇప్పుడు బలపడ్డ వారు కూడా మోడీ భజనలో తరించిపోతున్నారు. చంద్రబాబు, నితీశ్ కుమార్ ఈ కోవలోకి చెందినవారుగా చూడాలి. ఇకపోతే మోడీ తీసుకున్న కాంగ్రెస్ ముక్త భారత్ నినాదం పేలవంగా మారింది. ప్రజలు మోడీ పిలుపునకు పెద్దగా స్పందించడం లేదు. ఎమర్జెన్సీ గురించి ఇంకా మాట్లాడాల్సిన అవసరం లేదు. అయితే ఆనాటి చీకటి రోజులు అంటూ ఉపన్యాసాలు గుప్పిస్తున్నారు. అందుకే మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు కొందరు మొగ్గు చూపారు. దీంతో ఆ పార్టీ బలమైన విపక్షంగా ఎదిగింది. పథకాలు, ప్రజల ప్రయోజనాలు పట్టించుకుంటే కాంగ్రెస్ ఎదిగే అవకాశం లేకుండా పోయేది. కేవలం మోడీ హామీలను నినాదాలుగా మారుతున్నాయి. విధానాలు అటకెక్కుతున్నాయి. బిజెపి కన్నా కాంగ్రెస్ మేలన్న వాదన మెల్లగా బలోపేతం కావడానికి పరిస్థితులే కారణమని గుర్తించాలి. ఎన్‌డిఎ మిత్రపక్షాల అండతో మోడీ గద్దెనెక్కారు. అయినా మోడీ తన విధానాలు మార్చుకోవడం లేదు. ఈ క్రమంలో ప్రాంతీయ పార్టీలు తేడా వస్తే మోడీని గద్దె దింపడానికి వెనకాడరని గుర్తించాలి. చంద్రబాబు గతంలో అలిగి కాంగ్రెస్ జెండా పట్టుకున్నారు. ఇలాంటి ఉదాహరణలు చాలా ఉన్నాయి. అందువల్ల మోడీ క్షేత్రస్థాయి సమస్యలపై దృష్టి సారించాలి. ఉదాహరణకు హైదరాబాద్ మెట్రో విస్తరణ, కంటోన్మెంట్‌లో రోడ్ల విస్తరణ వంటి విషయాల్లో ప్రజల అవసరాలను చూడాలి. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉందని ప్రజల సమస్యలను విస్మరిస్తే బిజెపికి కీడు జరగగలదు. స్థాని క బిజెపి నేతలు కూడా అభివృద్ధికి సంబంధించి పనుల విషయంలో కీలకంగా ఉండాలి. కేవలం డబుల్ ఇంజిన్ సర్కారే శరణ్యమని కబుర్లు చెప్పడం మానుకోవాలి. మరోవైపు ప్రాంతీయ పార్టీలకు దర్యాప్తు సంస్థల పనితీరు దేశంలో జీవన్మరణ సమస్యగా మారింది. వివిధ కేసులతో ఆయా పార్టీల నేతలను వేధిస్తున్న తీరు కారణంగా అవి ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. ఆమ్ ఆద్మీ పార్టీని, ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి కేజీవ్రాల్‌ను తుదముట్టించడం కోసం బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదు. కేజ్రీవాల్ తన రాజకీయ అస్తిత్వం కోసం పోరాడుతున్న వేళ గుజరాత్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఓ స్థానం గెలవడం ఆశ్చర్యం కలిగించక మానదు. ప్రస్తు పరిస్థితుల్లో ప్రాంతీయ పార్టీలు బలహీనపడితే వాటి స్థానంలో బలపడేందుకు కాంగ్రెస్‌కే ఎక్కువ ఆస్కారం ఉన్నది. ఎందుకంటే కాంగ్రెస్ ఓటు బ్యాంకునే ప్రాంతీయ పార్టీలు అధికంగా కొల్లగొట్టాయి. బీజేపీ క్రియాశీలకంగా మారడానికి ముందే ప్రజలు కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతతో ప్రాంతీయ పార్టీలను ఆదరించారు. ఇవాళ దేశంలో ఉన్న అనేక ప్రాంతీయ పార్టీల పుట్టుకకు కాంగ్రెస్ అనుసరించిన విధానాలే కారణం. ఇప్పుడు మోదీ కూడా ప్రాంతీయ పార్టీలను బలహీనపరిస్తే చివరకు ప్రధాన పోటీ మళ్లీ బీజేపీ, కాంగ్రెస్‌లకే పరిమితం కావడం ఖాయం. లేదా ప్రాంతీయ పార్టీలన్నీ కాంగ్రెస్ గొడుగు కిందకు చేరి బలంగా మారుతాయి. ఏమైనా అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ మధ్య ప్రాంతీయ పార్టీలు నలిగిపోయే పరిస్థితి పలు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. బిజెపి పనితీరు సక్రమంగా లేకపోవడం వల్లనే కర్నాటక, తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. కర్నాకటలో బిజెపి కరప్షన్ కారణంగా ప్రజలను దూరం చేసుకుంది. తెలంగాణలో కెసిఆర్ అహంకారాన్ని అణచివేసేందుకు ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకున్నారు. కర్ణాటకలో బీజేపీ ఘోరపరాజయం చెందిన తర్వాత దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి అవకాశం లేకుండా పోతున్నది. ఇదంతా స్వయంకృతమని తెలంగాణ నిరూపించింది. కర్ణాటకతో పాటు హిమాచల్‌లో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రాగలిగింది. తరవాత తెలంగాణలోనూ కాంగ్రెస్ పాగా వేసింది. ఆంధ్రప్రదేశ్ లో టిడిపి, జనసేన కారణంగగా బిజెపి నిలదొక్కుకో గలిగింది. సొంతంగా ఇప్పుడు పోటీ చేసినా ఆ పార్టీకి ఒక్కసీటు కూడా రాదు. కర్ణాటకలో అంతరించిపోయే స్థితిలో జనతాదళ్ (ఎస్) బీజేపీతో చేతులు కలిపింది. నిజానికి కాంగ్రెస్ పార్టీ కంటే మోదీ ప్రాంతీయ పార్టీలను అణిచివేయడంపైనే అధికదృష్టి సారిస్తున్నారే మోనని ఒకరకంగా అనిపిస్తోంది. ఈడీ, సీబీఐలను ప్రయోగించి మహారాష్ట్రలో నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ, శివసేనలను చీల్చగలిగింది. పంజాబ్‌లో అకాలీదళ్‌ను దెబ్బతీసింది. బిహార్‌లో లోక్ జనశక్తిని ముక్కలు చేసింది. నితీశ్ కుమార్‌కు పొమ్మనకుండా పొగపెట్టి పంపించింది. తరవాత మళ్లీ దారికి తెచ్చుకుంది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతి నేతృత్వంలోని బీఎస్పీని బీజేపీ నిర్వీర్యం చేసింది. ఒడిషాలో నవీన్ పట్నాయక్‌ను దెబ్బతీసారు. ఈ క్రమంలో ప్రజలకు మేలు చేసే విధంగా పాలనా తీరు మారాల్సి ఉంది. ప్రంతీయ పార్టీలకయినా, కాంగ్రెస్, బిజెపిలకయినా ఇదే వర్తిస్తుంది. ఇది గమనించని రోజు ఏ పార్టీ అయినా ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

# ట్రస్ట్‌ను ఏర్పాటు చేసే యోచనలో టాటా



న్యూఢిల్లీ,ఎయిరిండియా విమానం ఏఐ 171 ప్రమాద బాధితులకు ఆర్థికసాయం అందించేలా ఓ ట్రస్ట్‌ను ఏర్పాటుచేయాలని టాటా సన్స్ బోర్డును అనుమతి కోరింది. గురువారం జరిగిన కీలక సమావేశంలో ఈ ప్రతిపాదన తీసుకొచ్చినందుకు టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ సభ్యులను అభినందించినట్లు ఓ ఆంగ్ల పత్రిక కథనంలో వెల్లడించింది. ఈ సమావేశానికి టాటా ట్రస్ట్ నామినీలు నోయల్ టాటా, వేణు శ్రీనివాసన్, విజయ్‌సింగ్ హాజరయ్యారు. ఈ ట్రస్ట్‌కు రూ.500 కోట్లు కేటాయించేలా అనుమతులు కోరింది. ఈ విమాన దుర్ఘటనను టాటా సంస్థ చాలా సీరియస్‌గా తీసుకొంది. ఎయిరిండియా రోజువారీ కార్యకలాపాల పర్యవేక్షణ బాధ్యతను నేరుగా టాటాసన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తన చేతుల్లోకి తీసుకొన్నట్లు వార్తలొస్తున్నాయి. సంస్థకు ఈ దుర్ఘటన పెనుసవాలుగా మారడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వంతో సంబంధాలు, ప్రయాణికుల భద్రతను అంచనా వేయడం, విమానాల నిర్వహణ, సిబ్బంది సంక్షేమం వంటివి ఆయన పరిధిలోకి రానున్నాయి. తమ సంస్థలు కష్టాల్లో ఉన్నప్పుడు ఛైర్మన్లు స్వయంగా రంగంలోకి దిగి వాటిని ఎదుర్కోవడం టాటా గ్రూపులో ఎప్పటినుంచో వస్తున్న సంప్రదాయం. 1989లో టాటాస్టీల్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకొని దాదాపు 50 మంది చనిపోయారు. నాడు జేఆర్‌డీ టాటా స్వయంగా రంగంలోకి దిగి ఈ సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. ఇక టాటా్గ ÷నాన్స్ కుంభకోణం, 26/11 తాజ్ హోటల్‌పై ఉగ్రదాడి సందర్భంగా ఆ వ్యవహారాలను నాటి ఛైర్మన్ రతన్ టాటా స్వయంగా పర్యవేక్షించారు. ఎన్.చంద్రశేఖరన్‌కు కూడా టీసీఎస్‌ను సంక్షోభాల నుంచి బయటపడేసిన రికార్డు ఉంది. ఇక తాజ్ హోటల్‌పై ఉగ్రదాడులు జరిగిన వేళ కూడా టాటా గ్రూప్ ఓ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసింది. బాధిత ఉద్యోగుల కుటుంబాలకు దీర్ఘకాలంపాటు ఆర్థిక, నైతిక మద్దతును అందించింది. వాస్తవానికి తొలుత టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ రెండు వేర్వేరు ట్రస్ట్‌లను ఏర్పాటుచేయాలని భావించింది. వీటిల్లో ఒకటి భారతీయ బాధితుల కుటుంబాలను చూసుకొనేందుకు కాగా.. మరొకొటి విదేశీ బాధితుల కుటుంబాల కోసం. తాజాగా ట్రస్ట్‌కు కేటాయించే సొమ్ముతో 271 బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించడం, క్షతగాత్రుల వైద్య ఖర్చులు, మెడికల్ కాలేజీ పునరుద్ధరణ, సమీపంలో విమాన శకలాల కారణంగా దెబ్బతిన్న వాటిని పునరుద్ధరించడం వంటి పనులు చేపట్టనుంది. మిగిలిన మూల నిధిని బాధిత కుటుంబాల దీర్ఘకాలిక అవసరాలు తీర్చడానికి వినియోగించాలని భావిస్తున్నారు. త్వరలోనే ట్రస్ట్‌ను రిజిస్టర్ చేసే అవకాశం ఉంది. ఇదే భారత, విదేశీ బాధితుల కుటుంబాలకు నేరుగా సాయం చేస్తుంది. ఈ కార్యక్రమానికి టాటా మోటార్స్ సీఎఫ్‌వో పీబీ బాలాజీ నేతృత్వం వహించనున్నారు. ఆయనకు నియంత్రణ సంస్థలు, ఫైనాన్షియల్, కార్పొరేట్ గవర్నెన్స్‌లో మంచి అనుభవం ఉంది.

## కన్యాకుమారిలో కుండపోత వర్షం

చెన్నై, తమిళనాడు కన్యాకుమారి జిల్లాలో రాత్రి నుంచి కుండపోతగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. మీనాక్షిపురం రోడ్డు, కోట్టార్ రోడ్డు, అసంబు రోడ్డు తదితర రహదారులలో మోకాలి లోతున నీరు ప్రవహించింది. విద్యార్థులు గొడుగులు పట్టుకుని వెళ్లారు. సుశీంద్రం, అంజుగ్రామం, మయిలాడి, కొట్టారమ్ తదితర ప్రాంతాల్లోనూ చెదురుముదురుగా వర్షాలు కురిశాయి.

# ప్రభుత్వం ఎవరిదైనా చక్రం వారి చేతిలో!



హైదరాబాద్,బీఆర్ఎస్ హయాంలో బాధితులుగా ఉన్న ఐఏఎస్‌లకు ఈ ప్రభుత్వంలో కీలకమైన పదవులు దక్కలేదనే చర్చలు చాలా రోజుల నుంచీ వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో చక్రం తప్పిన వారికే పదవులు దక్కుతున్నాయని, మార్పు ఎక్కడ వచ్చిందని అధికారులు నలుగురు కలిసిన చోట చర్చించుకోవడం కన్పిస్తున్నది.వారికి ఏ ప్రభుత్వం ఉన్నా ఒకటే. ఈ ప్రభుత్వం, ఆ ప్రభుత్వం అనే తేడా లేదు. వారి అధికార పీఠాలకు ఢోకా లేదు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక వెలుగు వెలిగిన అధికారులు.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా తమ ఆధిపత్యాన్ని, హవాను నడిపిస్తున్నారని సచివాలయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చలు నడుస్తున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయి ఏడాదిన్నర అవుతున్నా గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన అధికారులను కీలక శాఖల నుంచి తప్పించే సాహసం రేవంత్ రెడ్డి సర్కారు చేయడం లేదని అంటున్నారు. వారిని తప్పించని ఫలితంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ప్రతిపక్ష బీఆర్ఎస్ ముఖ్య నేతలకు ఎప్పటికప్పుడు చేరిపోతున్నాయనే ప్రచారం కొన్ని నెలలుగా బలంగా వినిపిస్తున్నది. అయినా.. ప్రభుత్వం నష్ట నివారణ చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నదని అంటున్నారు.

### బీఆర్ఎస్ పాలనలో చక్రం తిప్పారు ఇక్కడ తిప్పుతున్నారు

హైదరాబాద్,గత ప్రభుత్వంలో చక్రం తిప్పారని ప్రచారం జరిగినవారిలో ఇద్దరు అధికారులను మాత్రమే కొత్త ప్రభుత్వం బదిలీ చేసింది. వారిలో ఒకరు సీనియర్ ఐఏఎస్ అర్వింద్ కుమార్ కాగా, మరొకరు నవీన్ మిట్టల్. వీరిద్దరు మినహా ఏ ఒక్క అధికారిని కూడా బదిలీ చేసే ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వం చేయకపోవడం వెనుక కారణాలేంటన్న చర్చ సచివాలయ కారిడార్లలో బాహాటంగానే వినిపిస్తున్నది. ఫార్ములా ఈ రేసు కేసును బూచిగా చూపించి మున్సిపల్ వ్యవహారాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్‌ను అక్కడి నుంచి తప్పించి.. విపత్తుల నిర్వహణ విభాగానికి బదిలీ చేసింది. ఆయనపై ప్రస్తుతం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) విచారణ నిర్వహిస్తున్నది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా ఫార్ములా ఈ రేసు పై ఈసీఐఆర్ నమోదు చేయగా, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కే తారక రామారావు ఏసీబీ విచారణకు హాజరవుతున్నారు. కాంగ్రెస్ రాగానే మున్సిపల్ వ్యవహారాల శాఖకు నియమితులైన ఎం దాన కిశోర్ చేత ఫార్ములా ఈ రేసు కేసుపై ఏసీబీ విచారణకు ఫిర్యాదు చేయించి, తమ పని తీరడంతో ఆయనను అక్కడి నుంచి తప్పించి కార్మిక శాఖకు బదిలీ చేశారని సచివాలయంలో ఉద్యోగులు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను బదిలీ చేస్తారని తెలంగాణ సమాజం భావించింది. అయితే ఆయనపై ఈగ వాలనీయకుండా ఏడాదిన్నర పాటు రెండు పదవుల్లో కొనసాగించడంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. అయినా.. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏమాత్రం ఖాతరు చేయలేదని అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి నిధులు సమకూర్చారనే ఆరోపణలు నవీన్ మిట్టల్‌పై వచ్చినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకుండా మొన్నటి వరకు కొనసాగించిందని అంటున్నారు. ఏమైందో ఏమో కానీ తాజాగా జరిపిన బదిలీల్లో నవీన్ మిట్టల్‌ను రెవెన్యూ శాఖ నుంచి బదిలీ చేసి ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. అప్రాధాన్య పోస్టులో నియమిస్తారని ఊహించిన తెలంగాణ సమాజానికి కాంగ్రెస్ ప్రభుత్వం షాక్ ఇచ్చిందనే చెప్పాలి. వీరిలో ఒకరిని తప్పితే బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక వెలుగు వెలిసిన ఏ ఒక్క అధికారినీ కీలక పదవుల నుంచి తప్పించలేదని సచివాలయ వర్గాలు అంటున్నాయి.గత ప్రభుత్వంలో టీజీఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్‌గా సంవత్సరాల పాటు హవా చెలాయించిన ఈ వెంకటనరసింహా రెడ్డిని బదిలీ చేసి, తొలుత కీలకమైన విద్యాశాఖ డైరెక్టర్‌గా నియమించారు. ఆ తరువాత అక్కడి నుంచి తప్పించి పరిశ్రమలు, పెట్టుబడుల సీఈవో, మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, నాటి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావుతో చాలా సన్నిహింతగా మెలిగిన విషయం అందరికీ తెలిసిందే. టీజీఐఐసీ ద్వారా పెద్ద ఎత్తున పరిశ్రమలకు భూములు కేటాయించారని ఆరోపణలు ఉన్నాయి. ఒక పద్ధతి లేకుండా తమకు నచ్చిన వారికి తక్కువ రేటు, నచ్చనివారు అయితే అధిక ధరకు భూములను కేటాయించారనే విమర్శలూ వచ్చాయి. బషీర్ బాగ్ పరిశ్రమ భవన్‌లో ఉన్న టీజీఐఐసీ కార్యాలయానికి ఎప్పుడు వెళ్లినా నరసింహారెడ్డి ఉండేవారు కాదని, ఎవరైనా ప్రజా ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు గట్టిగా అడిగితే మంత్రి కేటీఆర్ లేదా జయేశ్ రంజన్ వెంట ఉన్నారని పేషీ సిబ్బంది చెప్పేవారని పలువురు గుర్తు చేస్తున్నారు. దీంతో వారు ఏం మాట్లాడకుండా మిన్నకుండి వెళ్లిపోయేవారని అంటున్నారు. ప్రస్తుత మెట్రో వాటర్ సప్లయి అండ్ సివరేజ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి కూడా బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అప్పటి మంత్రి టీ హరీశ్ రావుకు ఓఎస్డీగా పనిచేశారు. ఆయన వద్ద పనిచేస్తుండగానే ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఆ తరువాత ఐఅండ్ పీఆర్ స్పెషల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. కొద్ది రోజుల పాటు ఉద్యానవన శాఖలో పనిచేసి, శిక్షణపై వెళ్లివచ్చిన తరువాత హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయి అండ్ సివరేజి బోర్డు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. గత ప్రభుత్వంలో హరీశ్ రావుకు సన్నిహితంగా ఉంటూ పనిచేసిన ఆయనకు నగరంలో అత్యంత కీలకమైన మెట్రో వాటర్ బోర్డు ఎండీ బాధ్యత అప్పగించడంతో పలువురు కాంగ్రెస్ ముఖ్య నాయకులు సైతం ఆశ్చర్యానికి గురయ్యారు. బీఆర్ఎస్ ఏలుబడిలో పెద్ద నాయకుల వద్ద పనిచేసిన వారికి ఈ ప్రభుత్వంలో కూడా కీలక బాధ్యతలు అప్పగిస్తున్నారంటూ అప్పట్లో విమర్శలొచ్చాయి.మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖలో కీలకమైన మూడు పదవుల్లో తమిళనాడు రాష్ట్రానికి చెందిన ముగ్గురు ఐఏఎస్ అధికారులు చక్రం తిప్పుతున్నారనే అభిప్రాయాలు ఉన్నాయి. ముఖ్యమంత్రి కార్యాలయంలో మాణిక్కరాజ్ మున్సిపల్ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారు. ఆయన కేంద్ర ప్రభుత్వంలోని ఆర్థిక శాఖ వ్యవహారాల్లో పనిచేస్తూ, డిప్యూటేషన్ ముగియడంతో గతేడాది తెలంగాణ సర్వీసులో చేరిపోయారు. ఆ వెంటనే రేవంత్ రెడ్డి ఆయనను తన కార్యాలయంలో కార్యదర్శిగా నియమించి, మున్సిపల్ వ్యవహారాల బాధ్యతలను అప్పగించారు. పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శిగా బాధ్యతలు చూస్తున్న ఇలంబరితి మొన్నటి వరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేశారు. అక్కడి నుంచి బదిలీ చేసి కొత్తగా సృష్టించిన పట్టణాభివృద్ధి శాఖలో ఆయనను నియమించారు. ఇలంబరితి స్థానంలో ఆర్వీ కర్ణన్‌ను జీహెచ్ఎంసీ కమిషనర్ సీటులో కూర్చొనబెట్టారు. అంతకు ముందు ఆయన స్టేట్ ఫుడ్ సేఫ్టీ విభాగంలో కమిషనర్‌గా, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం డైరెక్టర్‌గా పనిచేసి నగరంలోని పలు హొటళ్లు, రెస్టారెంట్లు, తినుబండారాల దుకాణాలలో పెద్ద ఎత్తున సోదాలు నిర్వహించారు. దీంతో ఆయన పేరు నగరంలో ఒక్కసారిగా తెరమీదికి వచ్చింది. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ సిఫారసుతో జీహెచ్ఎంసీ కమిషనర్ గా నియమితులు అయ్యారనే చర్చ కార్పొరేటర్లలో వినిపిస్తున్నది. ఈ ముగ్గురు అధికారులు సచివాలయంలో సమావేశమైన సందర్భంలో ఎవరైనా అక్కడకు వెళితే అకస్మాత్తుగా వారు మాట్లాడుకునే భాష మారుతుందని పలువురు అధికారులు చెబుతున్నారు. మాట్లాడుతున్న ఆంగ్ల భాషను ఆపేసి తమిళంలోకి మారిపోతారు. దీంతో అక్కడికి వెళ్లిన అధికారికి వారు ఏం మాట్లాడుకుంటున్నదీ తెలియదు. కీలకమైన మున్సిపల్ శాఖలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారిని కింది నుంచి పై స్థాయి వరకు నియమించడం సరికాదనే చర్చ సచివాలయంలో జరుగుతోంది. వీరు ముగ్గురు కూడా శంషాబాద్ లోని ఒక రెసిడెన్సియల్ లే అవుట్ లోని విల్లాల్లో నివసిస్తున్నారని సమాచారం. ఈ ముగ్గురు అధికారులు పరస్పరం చర్చించుకుని పనులు చక్కదిద్దుకుంటున్నారని బిల్డర్లు, రియల్టర్లు చర్చించుకుంటున్నారు. వారికి వ్యతిరేకంగా వెళ్లడం కంటే ఊరుకోవడం మేలనే నిర్ణయానికి తాము వచ్చామంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో ఊహించుకోవచ్చని పలువురు రియల్టర్లు అంటున్నారు.

### వారికి ఈ సర్కార్‌లోనూ అన్యాయమే?

బీఆర్ఎస్ హయాంలో బాధితులుగా ఉన్న ఐఏఎస్‌లకు ఈ ప్రభుత్వంలో కీలకమైన పదవులు దక్కలేదనే చర్చలు చాలా రోజుల నుంచీ వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో చక్రం తప్పిన వారికే పదవులు దక్కుతున్నాయని, మార్పు ఎక్కడ వచ్చిందని అధికారులు నలుగురు కలిసిన చోట చర్చించుకోవడం కన్పిస్తున్నది. సబ్యసాచి ఘోష్, మహేష్ దత్ ఎక్కా, జ్యోతి బుద్ధ ప్రకాశ్, ఈ శ్రీధర్, బాలమాయదేవి, కే సురేంద్ర మోహన్, కొర్రా లక్ష్మీ ఇలా చెప్పుకుంటూ పోతే చాలా మందికి ఈ ప్రభుత్వంలో ముఖ్యమైన బాధ్యతలు దక్కడం లేదని అంటున్నారు. బుద్ధ ప్రకాశ్, శ్రీధర్‌కు ముఖ్య శాఖలు ఇచ్చినట్టే ఇచ్చి.. ఆ తర్వాత మార్చేశారని పలువురు సీనియర్ అధికారులు ప్రస్తావిస్తున్నారు. బాల మాయాదేవీ, కొర్రా లక్ష్మీ ఆ ప్రభుత్వంతో అన్యాయం జరగ్గా, ఈ ప్రభుత్వంలో కూడా అంతకన్నా ఎక్కువగా జరుగుతోందనే వాదనను అధికారులు వినిపిస్తున్నారు.

# జగన్ వాహనాన్ని తనిఖీ చేసిన అధికారులు

గుంటూరు, పల్నాడు జిల్లా రెంటపాళ్లలో వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనలో సింగయ్య అనే వృద్ధుడు మాజీ సీఎం కారు కింద నలిగి మృతి చెందిన కేసులో పోలీసులు దర్యాప్తును కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా జగన్ రెడ్డి వాహనాన్ని రవాణా శాఖ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. సింగయ్య మృతిపై ఇప్పటికే నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఈ క్రమంలో జగన్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు జిల్లా పోలీసు కార్యాలయంలో ఉంచారు. ఈ క్రమంలో ఏపీ 40 డీహెచ్ 2349 వాహనం ఫిట్ నెస్‌ను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. ఎంవీఐ గంగాధర ప్రసాద్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు జరిగాయి. కాగా.. ఇటీవల రెంటపాళ్ల పర్యటనకు జగన్ వచ్చిన సందర్భంగా గుంటూరు ఏటుకూరు బైపాస్ వద్ద జరిగిన ప్రమాదంలో వైసీపీ అధినేత కారు కింద పడి సింగయ్య అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై గుంటూరు నల్లపాటు పీఎస్‌లో కేసు నమోదు అవగా.. ఏ1గా డ్రైవర్ రమణారెడ్డి, ఏ2గా జగన్ మోహన్ రెడ్డి, వైసీపీకి చెందిన సుబ్బారెడ్డి, నాగేశ్వరరెడ్డి, విడుదల రజినీ, పేర్నినాని పేర్లు చేర్చారు.్గ ÷ళిసు నమోదు అనంతరం నల్లపాడు పోలీసులు సింగయ్య మృతికి కారణమైన జగన్ ప్రయాణించిన కారును తాడేపల్లికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. ఆ కారును గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఉంచారు. ఈరోజు గుంటూరుకు చెందిన రవాణా శాఖ అధికారులు.. జగన్ కారు ఫిట్ నెస్‌ను చెక్ చేశారు. ఆర్టీవోకు చెందిన మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర్ గంగాధర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఓ టీం గుంటూరు ఎస్పీ కార్యాలయానికి వచ్చి జగన్ వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనం ఫిట్‌గా ఉన్నట్లు రవాణా శాఖ అధికారులు నిర్ధారణకు వచ్చారు. యితే జగన్ వాహనం విషయంలో గుంటూరు ఎస్పీ రెండు రకాల ప్రకటనలు చేసిన విషయం తెలిసిందే. తొలుత జగన్ పర్యటన రోజు 0001 సఫారీ వాహనం ఢీకొని సింగయ్య మృతిచెందారని ప్రకటించారు. నాలుగు రోజుల తర్వాత జగన్ కారు కిందే పడి సింగయ్య మృతి చెందిన వీడియో బయటకు రావడంతో గుంటూరు ఎస్పీ మరోసారి మీడియా సమావేశం ఏర్పాటు చేసి జగన్ వాహనం కింద పడే సింగయ్య మృతి చెందినట్లు చెప్పారు. అలాగే ఈ ప్రమాదానికి సంబంధించి డ్రైవర్ రమణారెడ్డి, జగన్‌తో పాటు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. దీనిపై గుంటూరు జిల్లా పోలీసులపై కూడా అనేక విమర్శలు వచ్చిన నేపథ్యంలో.. తదుపరి విచారణలో ఎలాంటి తప్పిదాలు జరుగకుండా చూడాలని గుంటూరు పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు ఏపీ హైకోర్టులో మాజీ సీఎం జగన్‌కు స్వల్ప ఊరట లభించింది. సింగయ్య మృతి ఘటనలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని హైకోర్ట్‌లో జగన్ క్వాష్ పిటీషన్‌ను దాఖలు చేశారు. దీనిపై ఈరోజు హైకోర్టులో విచారణకు రాగా.. జగన్ తరఫున న్యాయవాదులు వాదనలు వినిపించారు. అయితే కేసు విచారణను జూలై 1కి (మంగళవారం)కు వాయిదా వేసింది కోర్టు. అప్పటి వరకు ఎటువంటి తొందర పాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులకు హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

## కోల్‌కతాలో మరో దారుణ ఘటన

కోల్‌కతా, మెడికల్ విద్యార్థిని హత్యాచాగర ఘటన మరువక ముందే కోల్‌కతాలో మరో ఘోరమైన ఘటన చోటుచేసుకుంది. ఓ లా విద్యార్థినిపై కళాశాల ప్రాంగణంలోనే సామూహిక అత్యాచారం జరిగింది. ఇటీవల ఇదే రాష్ట్రంలో ఓ జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా కుదిపేసిన సంగతి తెలిసిందే. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కస్బాలోని సౌత్ కోల్‌కతా లా కళాశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈనెల 25 రాత్రి ఓ విద్యార్థినిని కొందరు వ్యక్తులు బలవంతంగా సెక్యూరిటీ సిబ్బంది గదిలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డారు. మరుసటిరోజు దీనిపై కేసు నమోదవడంతో.. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారిలో ఇద్దరు సిబ్బంది కాగా మరొకరు పూర్వ విద్యార్థి అని గుర్తించారు. బాధితురాలికి ప్రాథమిక చికిత్స అందించి, పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై భాజపా నేత అమిత్ మాలవీయా స్పందించారు. ఈ దారుణాన్ని ఖండించిన ఆయన.. రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. 'ఘోరం. లా విద్యార్థినిపై కాలేజీలో సామూహిక అత్యాచారం జరిగింది. నిందితుల్లో ఒక పూర్వ విద్యార్థితో పాటు ఇద్దరు సిబ్బంది కూడా ఉన్నారు. ఆశ్చర్యకరమైన విషయ మేమంటే.. టీఎంసీ పార్టీకి చెందిన ఓ సభ్యుడు కూడా ఇందులో ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్జీకర్ భయానక ఘటనను మరవకముందే మరో ఘటన చోటుచేసుకుంది. పశ్చిమబెంగాల్‌లో ఇలాంటి దారుణాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. సీఎం మమతా బెనర్జీ పాలనలో ఇక్కడి మహిళలకు భద్రత లేకుండా పోయింది. అత్యాచారం ఇక్కడ నిత్యకృత్యంగా మారింది. బాధితురాలికి, ఆమె కుటుంబసభ్యులకు భాజపా అండగా ఉంటుంది. ప్రతి నిందితుడికి శిక్ష పడేవరకు ఊరుకోం' అని ఆయన ఎక్స్‌లో రాసుకొచ్చారు.

## మేలు చేస్తుందా ..!

అమరావతి,ఇంటింటికి వైసీపీ పేరుతో వైసిపి అధినేత జగన్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఒక లక్ష నిర్దేశం చేశారు. రాజకీయాల్లో ప్రజలను కలుసుకోవడం, ప్రజా సమస్యల ప్రస్తావించడం, వారి సమస్యలపై పోరాటం చేయటం అనేది ప్రతిపక్షంగా నాయకులు చేయాల్సిన కర్తవ్యం. వాస్తవానికి చెప్పాలంటే 2019లో టిడిపి అధినేత చంద్రబాబు కేవలం 6 మాసాల గడువు లోపే ప్రజల మధ్యకు వచ్చేశారు. అప్పటి వైసీపీ ప్రభుత్వాన్ని ఆయన తూర్పారబట్టారు. ఆయనతో పోల్చి చూసుకుంటే జగన్ చాలా లేట్ చేశారని చెప్పాలి.ఇప్పటికే పలుమార్లు ప్రజల మధ్యకు వస్తానని చెప్పి ఆయన రాకపోవడం, నాయకులను, కార్యకర్తలను పంపించే ప్రయత్నం చేసిన అది కూడా సక్సెస్ కాకపోవడం వంటివి పార్టీలోను బయట రాజకీయ వర్గాల్లోనూ చర్చ గా మారింది. ఈ క్రమంలో తాజాగా చంద్రబాబు మేనిఫెస్టోను రీకాల్ చేస్తూ ప్రజల మధ్యకు వెళ్లాలని జగన్ పెట్టుకున్న లక్ష్యంగా కనిపించింది. తద్వారా 2024 ముందు ఇచ్చినటువంటి హామీలు, చేస్తామన్న పనులు, ఎన్నికల తాయిలాలు వంటివి తిరిగి ప్రజలకు గుర్తు చేయాలనేది జగన్మోహన్ పెట్టుకున్న లక్ష్యం.అయితే ఇది ఎంతవరకు సక్సెస్ అవుతుంది, ఎంతవరకు విఫలం అవుతుంది అనేది పక్కన పెడితే కీలకమైన వైసిపి ఓటు బ్యాంకుకు మాత్రం ఇది ఎంతో కొంత మేలు చేస్తుంది అనేది పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఎలా అంటే.. గత ఎన్నికల్లో జగన్ కన్నా ఎక్కువగా తమకు మేలు జరుగుతుందన్న ఉద్దేశంతో వైసిపికి అనుకూలంగా ఉన్న కొన్ని కుటుంబాలు టిడిపికి ఓటు వేసి ఉంటే లేదా కూటమికి ఓటు వేసి ఉంటే ఇప్పుడు ఆయా వర్గాలు తిరిగి వైసిపికి అనుకూలంగా మారేందుకు ఈ ఇంటింటికి కార్యక్రమం కచ్చితంగా ఉపయోగపడుతుందని చెబుతున్నారు .తద్వారా ఇది భవిష్యత్తులో వైసీపీకి మేలు చేస్తుంది అనేది పరిశీలకు ల అంచనా. ఇది పూర్తి స్థాయిలో మేలు చేస్తుందా.. పరోక్షంగా మేలు చేస్తుందా అనేది పక్కన పెడితే మొత్తానికి ప్రజల్లోకి అయితే వైసీపీకి ఒక ఇమేజ్ పెరుగుతుందనేది, అదే విధంగా కూటమి సర్కారుకు కూడా మరోవైపు ఒత్తిడి పెరిగి పథకాలను అమలు చేయడమా లేకపోతే ఎదురు దాడి చేయడం అనేది తేల్చుకునే పరిస్థితి వస్తుందని అంచనా కూడా వినిపిస్తోంది. ఎలా చూసుకున్నా జగన్ చాలా వ్యూహాత్మకంగానే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెబుతున్నారు.

# సర్కార్ అసమర్థతకు నిదర్శనం

హైదరాబాద్: జంటనగరాలకు మంచినీరు అందించే మంజీరా బ్యారేజీని కూడా ప్రమాదంలో పడేయడం అత్యంత ఆందోళనకరం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ సర్కారు చేతకానితనంతో జూరాల ప్రాజెక్టును డేంజర్‌లోకి నెట్టిన సంఘటనకు 24 గంటలు గడవకముందే ఈ ఘటన చోటు చేసుకోవడం అసమర్థ పాలనకు నిదర్శనమని అన్నారు. సాగు, తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణలో సీఎం రేవంత్ ఘోర వైఫల్యం వల్లే వరుసగా నిన్న జూరాల ప్రాజెక్టుకు, నేడు మంజీరా బ్యారేజీకి డేంజర్ బెల్స్ మోగుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్డీఎస్ఓ) నిపుణుల బృందం గత మార్చి 22న బ్యారేజీని సందర్శించి సమర్పించిన నివేదికను ప్రభుత్వం నిర్లక్ష్యంగా పక్కనపెట్టడం క్షమించరాని నేరం. మేడిగడ్డ బ్యారేజీ వద్ద కూడా చరిత్రలో లేనంత వరద రావడంతో రెండు పిల్లర్లకు పగుళ్లు వచ్చిన తరహాలోనే, ఇప్పుడు మంజీరాపై కూడా వరద ఒత్తిడి పెరిగి దిగువ భాగంలో పిల్లర్లకు పగుళ్లు రావడం, అఫ్రాన్ కొట్టుకుపోవడం, స్పెల్ వేలోని భాగాలు కూడా దెబ్బతిన్నట్టు ఎస్డీఎస్ఏ నివేదిక గుర్తించినా ముఖ్యమంత్రి మొద్దునిద్ర వీడకపోవడం మరో దుర్మార్గం అని కేటీఆర్ మండిపడ్డారు. నిన్నటిదాకా ఎన్డీఎస్ఏ నివేదిక చెప్పినా మేడిగడ్డ బ్యారేజీని రిపేర్ చేయక పోవడం, నేడు ఎస్డీఎస్ఓ నివేదిక అందినప్పటికీ మంజీరా బ్యారేజీ మరమ్మత్తులు చేపట్టకపోవడం.. ఈ కాంగ్రెస్ సర్కారు అలసత్వానికే కాదు.. దుర్మార్గపు వైఖరికి ప్రత్యక్ష నిదర్శనం అని నిప్పులు చెరిగారు కేటీఆర్. రానున్న రోజుల్లో పైనుంచి మంజీరాలో వరద ఉధృతి పెరిగితే మరింత కోతకు గురై చివరికి డ్యామ్‌ను కూడా ప్రమాదంలోకి నెట్టే పరిస్థితి తలెత్తవచ్చని నిపుణులు అంచనా వేస్తున్న క్రమంలో ఇకనైనా ఈ చిల్లర రాజకీయాలు మాని అటు మేడిగడ్డ బ్యారేజీని, ఇటు మంజీరా బ్యారేజీని వెంటనే రిపేర్ చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై, కాంగ్రెస్ సర్కారుపై ఉందని కేటీఆర్ అన్నారు. బ్యారేజీల సామర్థ్యానికి మించిన వరద వచ్చిన సందర్భాల్లో ఆ ఒత్తిడిని తట్టుకోలేకే పిల్లర్లకు పగుళ్లు వచ్చినట్టు ఎస్డీఎస్ఓ గుర్తించింది. సరిగ్గా మేడిగడ్డ వద్ద కూడా ఊహించని వరద పోటెత్తడం వల్ల అక్కడ కూడా ఇదే తరహాలో పగుళ్లు ఏర్పడ్డాయి. కానీ దీన్ని అసెంబ్లీ ఎన్నికల వేళ భూతద్దంలో చూపించి అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ కుమ్మక్కై బీఆర్ఎస్‌పై బురదజల్లాయి. మేడిగడ్డ బ్యారేజీలోని రెండు పియర్స్‌కు వచ్చిన పగుళ్లపై నానాయాగీ చేసిన కాంగ్రెస్-బీజేపీ నేతలు మంజీరా బ్యారేజీ పిల్లర్లకు వచ్చిన పగుళ్లపై కనీసం స్పందించకపోవడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. గత ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులు, బ్యారేజీల్లో స్వల్ప రిపేర్లు వస్తే, అప్పటికప్పుడు వాటిని మరమ్మత్తు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారే తప్ప కాళేశ్వరంపై కక్షగట్టినట్టు ఏ ప్రభుత్వాలు గతంలో వ్యవహరించలేదు. పరిపాలన చేతకాక కేవలం రాజకీయ కక్షసాధింపులతో కాలం వెల్లదీస్తున్న ఈ ముఖ్యమంత్రి మంజీరా, మేడిగడ్డ వంటి తాగు సాగునీటి బ్యారేజీలను రిపేర్లు చేయకుండా వదిలేస్తే, సీఎం రేవంత్‌ను, కాంగ్రెస్ సర్కారును చరిత్ర ఎప్పటికీ క్షమించదు అని కేటీఆర్ హెచ్చరించారు.

# ఆయుధ రాజకీయాల ఉచ్చులో ఇరాన్!



టెహ్రాన్:అమెరికా ఆర్మీ హెడ్ జనరల్ మెక్ ఆర్థర్ అత్యంత భయంకరమైన పరమాణు బాంబును జపాన్ మీద అమెరికా ప్రయోగించినప్పుడు.. ఆ ప్రళయకాండ చూసి తట్టుకోలేకపోయాడు. ఇంత పెద్ద విధ్వంసం ఒక ఆటంబాంబు సృష్టించగలదా? అని విలపిస్తూ అతడు అన్న వాక్యాలు ఇవి The supreme value of human life and human dignity has been forgottenµ. కాలం మారినా యుద్ధాలు అందించిన పాఠాల నుండి ఇంకా ప్రభుత్వాలు ఏం నేర్చుకోలేదని తెలుస్తోంది. ఇటీవల జూన్ 22న అమెరికా మళ్లీ ఇరాన్ అణ్వాయుధాలని చెబుతున్న స్థావరాల మీద చేసిన దాడుల్ని చూస్తే యుద్ధాలు ఆనాడే కాదు.. ఏనాడు కూడా ఆగవు అని తెలుస్తుంది.ఎప్పుడో 2015కు ముందు ఇరాన్ దగ్గర పరమాణు బాంబుకు సంబంధించిన ఏవో పదార్థాలు ఉన్నాయని, వాటితో అది పరమాణు బాంబు తయారు చేసుకోగలుగుతుందని ఒక అస్పష్టమైన రిపోర్టుని ఈ రోజు బయటకు తెచ్చి ఐఏఈఏ సంస్థను ముందుకు పెట్టి చర్చల పరంపర పూర్తి కాకుండానే ప్రపంచం ముందు ఇరాన్‌ను దోషిగా నిల్చోబెట్టి ఇరాన్ మీద ఇటు అమెరికా, అటు ఇజ్రాయిల్ దాడి చేసే నేపథ్యం వెనుక జాతీయ, అంతర్జాతీయ కుట్రలు ఎన్నో దాగి ఉన్నాయి..

అణుబాంబుల గురించి నీతి కథలు వద్దు!

ఏ దేశమైనా పరమాణు బాంబు తయారు చేయాల నుకుంటే దాన్ని మానవాళి ఎప్పుడూ కూడా సమర్థించదు. సాధారణ ప్రజలు ఏ దేశం వారైనా వారికి యుద్ధాలతో పనిలేదు.. రోజువారీ జీవితం సక్రమంగా కొనసాగితే చాలు అని కోరుకుంటారు. బాంబులైనా, బాలిస్టిక్ మిస్సైల్స్ అయినా, అణ్వాయుధాలైనా, వివిధ రకాల యుద్ధ సామాగ్రి అయినా అవసరం ప్రజలకు ఉండదు. ఆనాడు ఇరాక్‌లో పరమాణు బాంబులు ఉన్నాయని ఇరాక్ మీద దాడి చేసి దాన్ని సర్వనాశనం చేసింది అమెరికా. కానీ, వెదికి రుజువు చేయలేకపోయింది. అంతకుముందు, రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ పూర్తిగా ఓడిపోయి లొంగిపోయిన తర్వాత కూడా తమ దగ్గర ఉన్న పరమాణు బాంబు ఎలా పనిచేస్తుందో తెలుసుకోవాలని గొప్ప ఉత్సాహంతో.. జపాన్ మీద వేయాల్సిన అవసరం లేకపోయినా సరే హిరోషిమా, నాగసాకి మీద అమెరికా ప్రయోగించింది. దీంతో ప్రపంచం ఏనాడూ చూడని, కనీవినీ ఎరగని అత్యంత మానవ విషాదం జపాన్‌లో మనం చూశాం. ఆ ప్రభావంతో ఈ రోజుకి కూడా జపాన్ ప్రజలు రేడియేషన్‌కి గురవుతూనే ఉన్నారు. అలాంటి పరమాణు బాంబుని ప్రపంచం మీద ప్రయోగించిన అమెరికా, ప్రపంచశాంతికి భగ్నం కలిగించిన అమెరికా ఈ రోజు ఆటం బాంబుల గురించి నీతి కథలు, పంచతంత్ర కథలు వల్లిస్తోంది.

వ్యాపారంలో పోటీ పడితే చాలు.. విలన్లే

ఆయుధాల ఫ్యాక్టరీలకు యుద్ధాలు కావాలి.. వాటిని కొనసాగించేందుకు ట్రంప్ లాంటి పెద్ద నియంత కావాలి. యుద్ధాలకు ఒక కథ కావాలి. స్క్రీన్ ప్లే కావాలి. దర్శకత్వం కావాలి. ఆయుధాల ఫ్యాక్టరీలు మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లాలి అంటే, ఆయుధాల ఫ్యాక్టరీల కార్పొరేట్లు విపరీతమైన లాభాలతో సర్వసుఖాలు అనుభవించాలి. అంటే, దేశ దేశాల మధ్య సంఘర్షణలు ఉండాలి. లేకపోయినా, ఈ మహానుభావులు కొత్త కథలు అల్లుతారు. మరి యుద్ధాలు జరిగితేనే కదా ఆయుధాల స్టాక్ ఖాళీ అవుతుంది. ఆయుధాలు చెల్లితేనే కదా మరలా ఆయా ఫ్యాక్టరీల్లో కొత్త అప్డేటెడ్ ఆయుధాలు తయారవుతాయి. ప్రతి దేశంలో సంఘర్షణ కోసం వీరికి ఒక కథ అవసరం. కథా రచయితలు వీరి సీఐఏ ఆస్థానంలో ఎల్లప్పుడూ ఉండనే ఉంటారు. క్షణాల్లో స్క్రిప్ట్ అందించేస్తారు.. ఎవరిని విలన్ చేయాలో, ఎవరిని హీరో చేయాలో జీ హుజుర్ అని ఈ కథకులు సిద్ధంగా ఉంటారు. గాజాను నెలల తరబడి స్మశాన వాటికగా మార్చేస్తున్న ఇజ్రాయిల్ నెతన్యాహుని ఈ కథకులు హీరోగా మార్చేస్తారు.. తమ వ్యాపార అవసరాలకు భగ్నం కలిగిస్తూ వ్యాపారంలో దూసుకుపోతున్న ఇరాన్ లాంటి దేశాలను విలన్ చేసేస్తారు.

చైనాకు, రష్యాకు బుద్ధి చెప్పాలని..

ఈ రోజు శత్రువుగా ఉన్న ఇరాన్ ఒకప్పుడు అమెరికాతో ఆత్మబంధువుగానే ఉండేది. ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం తర్వాత అధికార పీఠాలు మారిపోయినప్పుడు, ఇరాన్‌కు అమెరికాకు మధ్య మిత్ర సంబంధాలు తగ్గిపోయినప్పుడు దాంతో పాటు చైనా, రష్యా ఇరాన్‌తో షేక్ హ్యాండ్ ఇవ్వడంతో ఈ ముగ్గురి త్రయం దౌత్య సంబంధాలను, చమురు సంబంధాలను పెంచుకున్నప్పుడు అమెరికా విలన్‌కు కాస్త కష్టంగానే ఉంటుంది. తనకు ఎదురు తిరిగి ఎవరు నిలబడకూడదు కదా.. ఇరాన్ మీద చిన్న దెబ్బ వేయక తప్పదు. అలా వేస్తేనే కదా అటు చైనాకు, రష్యాకు బుద్ధి చెప్పినట్టు ఉంటుంది. ఇటు ఇజ్రాయిల్‌ను సమర్థించినట్టు ఉంటుంది. మరోవైపు తమ దేశంలో ఉన్న ప్రైవేటు ఆయుధాల కర్మాగారాలకు మంచి డిమాండ్‌ను అందించినట్టు ఉంటుంది. మానవ సంహారం జరిగితేనే కదా ఆ బాంబులు ఎలా పనిచేస్తున్నాయో తెలిసేది. అప్పుడే కదా అంతకంటే మరింత భయంకరంగా, మరింత సాంకే తికంగా, మరింత కర్కశంగా నరసంహారం చేయగలిగే బాంబుల్ని, విమానాల్ని తయారు చేయగలదు.

# జగన్నాథ రథయాత్ర సంబరం

పూరి,ఒడిశాలోని పూరీలో జగన్నాథ రథయాత్ర అట్టహాసంగా, శోభాయమానంగా ప్రారంభమైంది. ఏటా ఆషాఢ మాసం శుక్ల పక్ష ద్వితీయ తిథి పర్వదినాన జగన్నాథుని రథయాత్రను చేపడతారు. ఈ విశ్వవ్యాప్త భారీ రథయాత్రను వీక్షించేందుకు ఇందులో పాల్గొనేందుకు దేశవిదేశాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. పూరీనగర వీధులన్నీ జై జగన్నాథ్! అనే భక్తుల నినాదాలతో ప్రతిధ్వనించాయి. భారీ జనసందోహం రాకను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. తీర ప్రాంతం వెంబడి విస్తృత స్థాయిలో బలగాలను మోహరించింది. నగరాన్ని హై-సెక్యూరిటీ జోన్‌గా మార్చారు. ఎఐ ఆధారిత నిఘా, రియల్ టైమ్ టెక్నాలజీతో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సుందరరథంపై కొలువుదీరిన జగన్నాథుడు, ఆయన సోదరుడు బలభద్రుడు, సోదరి దేవి సుభద్రలు గుండిచా ఆలయానికి ఊరేగింపుగా తరలివెళతారు. ఇక్కడ జగన్నాథుడు, బలభద్రుడు, దేవి సుభద్రలు వారం రోజుల పాటు సేదతీరతారు. ఆ తర్వాత బహుదా యాత్ర ద్వారా ప్రధాన ఆలయానికి తిరిగి వస్తారు. కాగా, ఈ భారీ ఆధ్యాత్మిక కార్యక్రమానికి ప్రభుత్వ యంత్రాంగం అత్యాధునిక భద్రతా ఏర్పాట్లను పూర్తిచేసింది. పదివేలకు పైగా సిబ్బందిని తీరం వెంట మోహరించింది. కీలక ప్రాంతాలలో 275 కంటే ఎక్కువ ఎఐ ఆధారిత సిసి కెమెరాలను అధికారులు ఏర్పాటు చేశారు. భారీ జనసందోహం పాల్గొంటున్నందున్నఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించడానికి ఒడిశా పోలీసులు ఎనిమిది కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు దళాలతో సహా సుమారు 10,000 మంది సిబ్బందిని మోహరించారు. నేషనల్ సెక్యూరిటీ గార్డ్ స్నిప్పర్ల సాయంతో గ్రాండ్ రోడ్డు వెంబడి రక్షణ బాధ్యతలను చేపట్టారు. తీరప్రాంత భద్రతను కోస్ట్ గార్డ్, భారత నావికాదళం నిర్వహిస్తున్నాయి. భద్రతా కార్యకలాపాలను పర్యవేక్షించడానికి పూరీలో తొలిసారిగా ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఒడిశా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వైబి ఖురానియా మాట్లాడుతూ, రియల్ టైమ్ పర్యవేక్షణ కోసం పట్టణం అంతటా, కోణార్క్‌కు వెళ్లే మార్గాల్లో 275 కి పైగా ఎఐ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసు డ్రోన్లు, బాంబు స్క్వాడ్లు, యాంటీ-సాబోటేజ్ బృందాలు, డాగ్ స్క్వాడ్లు, మెరైన్ పోలీసులు కూడా విస్తృతమైన ఏర్పాట్లలో భాగమయ్యారు. ఉరుములు, ఈదురుగాలులు వీచే అవకాశమున్నందున, భారత వాతావరణ శాఖ పూరీతో సహా అనేక జిల్లాల్లో భక్తులు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. కాగా, రథయాత్రకు ఒక రోజు ముందు వేలాది మంది భక్తులు 'నవయవ్వన దర్శనం' లో పాల్గొన్నారు. దేవతల కళ్లకు రంగులు వేసే 'నేత్రోత్సవం' వీక్షించగలిగారు. రహస్య మందిరంలో15 రోజుల పాటు దేవతలను ఉంచాక ఆచారం ప్రకారం జూన్ 11న భక్తులకు ఈ దర్శనం చేసుకునే అవకాశం లభించింది.

# గుజరాత్ రథయాత్రలో అపశృతి

గాందీనగర్, నేడు జగన్నాథుడి రథయాత్ర ప్రతి ఏటా ఆషాఢ శుద్ధ విదియ నాడు జరిగే రథయాత్రను దేశ వ్యాప్తంగా భక్తులు ఘనంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఇవాళ పలు ప్రధాన నగరాల్లో జగన్నాథుడి రథయాత్రకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో గుజరాత్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో అపశృతి చోటు చేసుకుంది. గుజరాత్‌లోని గోల్‌వాడ వద్ద జగన్నాథుడి రథయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా రథయాత్ర కోసం తీసుకొచ్చిన ఓ ఏనుగు జనసమూహాన్ని చూసి బీభత్సం సృష్టించింది. అదుపుతప్పి జనంపైకి దూసుకెళ్లింది. దీంతో భక్తులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఏనుగు దాడి నుంచి తప్పించు కునేందుకు ఎక్కడివారు అక్కడ పరుగులు తీశారు. ఈ క్రమంలో అక్కడ తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ ఘటనలో పలువురు భక్తులు గాయపడ్డారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు ఆ ఏనుగును అదుపు చేశారు. తొక్కిసలాటలో గాయపడిన భక్తులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

# మంత్రులకు కొత్త సవాల్.! పదవుల కోసం రాంగ్ సిగ్నల్స్ కరెక్టా?



హైదరాబాద్,కాంగ్రెస్ అంటేనే కథలు కథలుగా మ్యాటర్ ఉంటుంది. ఇదో ఫుట్ బాల్ గ్రౌండ్ మాదిరి అన్నట్లు. ఎవరి ఆట వారు ఆడి వెళ్తుంటారు. ఎవరికి నచ్చింది వాళ్లు చేస్తుంటారు. అదే కాంగ్రెస్. కానీ క్రమశిక్షణ అనేది కూడా ఉంటుంది కదా. ఎవరికి నచ్చిన గేమ్ వారు ఆడుతానంటే ఎప్పటికీ కుదరదు కదా.. అందుకే ఇప్పుడు హైకమాండ్ కూడా డిసిప్లిన్ అస్త్రాన్ని బయటకు తీస్తోంది. ఎందుకంటే పార్టీని బలోపేతం చేయాల్సింది పోయి నష్టం చేసే వారిపై నజర్ పెట్టింది. వీటికి తోడు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు సవాల్, అటు జూబ్లీహిల్స్ బైపోల్ టెస్ట్ ఉండనే ఉన్నాయి. మరి లెక్క సెట్ అవుతుందా?

క్యాడర్‌ను యాక్టివేట్ చేస్తున్న కాంగ్రెస్

రైట్ ఇదీ మ్యాటర్. కాంగ్రెస్ ఇప్పుడు పార్టీ సంస్థాగత నిర్మాణంపై ఫోకస్ పెంచుతోంది. కార్యకర్తలను మళ్లీ యాక్టివేట్ చేసే పనిలో ఉంది. ఎందుకంటే స్థానిక సంస్థల ఎన్నికల రూపంలో చాలా సవాళ్లు ఎదురవుతున్నాయి. అధికారంలో ఉన్న పార్టీ.. లోకల్ బాడీ ఎన్నికల్లోనూ సత్తా చాటితే ఆ పట్టు వేరే లెవెల్ లో ఉంటుంది. అందుకే ప్రతి అడుగు చాలా జాగ్రత్తగా వేస్తున్నారు. అయితే ఇందులో చాలా ట్విస్టులు ఉన్నాయి. కాంగ్రెస్ పరిస్థితి తెలిసిందే కదా.. ఇంటర్నల్ వార్ పెరుగుతోంది. కొత్త, పాత నేతలకు మధ్య పడట్లేదు. పైకే నవ్వులు.. లోలోపల మాత్రం కంటికి కనిపించని శత్రుత్వాలు. ఇదీ సీన్. ఇక్కడ చూడండి.. కాంగ్రెస్ పార్టీకి చెందిన గొల్లకురుమ నేతలు గాంధీ భవన్ దగ్గర గొర్రెలు తీసుకొచ్చి నిరసన తెలిపారు. క్యాబినెట్ లో అవకాశం ఇవ్వడం, గొల్లకురుమల కార్పొరేషన్ ఏర్పాటు చేసి 5 వేల కోట్లు ఇవ్వాలన్న డిమాండ్లు వినిపించారు. అయితే దీనిపై సీఎం రేవంత్ రెడ్డి పరోక్షంగా సీరియస్ అయ్యారు. గాంధీ భవన్ లో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ మీటింగ్ లో ఇలాంటి విషయాలన్నీ చర్చకు వచ్చాయి. ఇందులో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, రాష్ట్ర ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ పాల్గొన్నారు. పదవుల కోసం గాంధీ భవన్ లో ధర్నా చేయడం, రాంగ్ సిగ్నల్స్ పంపినట్లు అవుతుందన్న మాటను సీఎం రేవంత్ వినిపించారు. గాంధీ భవన్ లో ఇంకోసారి ధర్నాలు చేయొద్దని, ఏదైనా ఉంటే సీఎం లేదంటే పీసీసీ చీఫ్ దృష్టికి తీసుకురావాలన్నారు.

కష్టపడుతున్న వారు, కష్టపడని వారి లిస్టులు

ఇదే కాదు.. పార్టీకోసం నిజంగా కష్టపడుతున్న వారెవరు.. యాక్టింగ్ చేస్తున్న వారెవరు.. రివర్స్ లో తీసుకెళ్లాలనుకుంటున్న వాళ్లెవరు ఇది తేల్చాలని డిసైడ్ అయ్యారు. పీసీసీ కార్యవర్గంలో ఉన్న వారిని రెండు జాబితాలుగా రెడీ చేసి అందరికీ పని అప్పగించాలన్నారు. అంటే పని చేసిన వారిని ఒక లిస్ట్, చేయని వారిది ఇంకో లిస్ట్ రెడీ చేయబోతున్నారన్న మాట. డిసిప్లిన్ తో పని చేసిన వారికి ప్రమోషన్, చేయని వారికి డిమోషన్ ఇందులో ఎలాంటి మొహమాటం లేదని ఘాటుగానే సిగ్నల్స్ పంపారు. తాజా మీటింగ్ కాంగ్రెస్ లో టాప్ టు బాటమ్ అందరినీ అలర్ట్ చేసినట్లైంది. మంత్రుల పనితీరుపైనా గరంగరంగానే ఘాటు డీలింగ్ నడిచింది. నామినేటెడ్ పోస్ట్ ల భర్తీ ఎందుకు జరగట్లేదు, ఇంఛార్జ్ మంత్రులు సరిగా దృష్టి సారించకపోవడం, ఇవన్నీ చర్చకు వచ్చాయి. లోకల్ బాడీ ఎన్నికల బాధ్యత మంత్రులదే అని సీఎం క్లారిటీగా చెప్పేశారు కూడా. కార్యకర్తలను గెలిపించుకోవాల్సిన బాధ్యత నాయకులపై ఉందంటున్నారు.

లోకల్ బాడీతో పాటే.. జూబ్లీహిల్స్ బైపోల్ కూడా అధికార కాంగ్రెస్ పార్టీకి సవాల్ గా మారింది. ఇదే టైంలో నేతలు ఎవరికి వారే తామే అభ్యర్థులమని, గెలుపు పక్కా అని ప్రకటించుకుంటున్నారు. తలా ఒక మాట మాట్లాడొద్దని, ఇది పార్టీ క్రమశిక్షణ రాహిత్యం కిందకు వస్తుందన్నారు సీఎం. ఉప ఎన్నికపై హై కమాండ్ నిర్ణయం తీసుకుంటుందని, ఎవరికి వారు సొంత నిర్ణయాలు తీసుకోవద్దంటున్నారు సీఎం రేవంత్. సో పార్టీలో ఐక్యత ముఖ్యం. గెలవాలంటే కమిట్ మెంట్ కీలకం. ఇదే దిశానిర్దేశం చేస్తున్నారు. మరి హస్తం నేతలు ఫాలో అవుతారా?

యూనిటీగా ముందుకు సాగే ఫార్ములా ఏది?

ఎంపీలకు, ఎమ్మెల్యేలకు మధ్య పొసగట్లేదు. ఎమ్మెల్యేలకు కిందిస్థాయి క్యాడర్ కు గ్యాప్ ఉంది. ఇక పార్టీలో పాత, కొత్త నేతల మధ్య ఇంకా సయోధ్య రాలేదు. ఉప్పు నిప్పులాగే సీన్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో హస్తవాసి సాధ్యమా? జిల్లా ఇంఛార్జ్ మంత్రులపై పెద్ద బాధ్యత, కానీ అంతర్గత విభేదాలు, ఎమ్మెల్యేల చుట్టూ తిరిగే ఆశావాహులు.. ఈ సవాళ్లను అధిగమించి గెలుపు సాధ్యమా? ఏం జరగబోతోంది? కాంగ్రెస్ లో కథలు చాలా టిపికల్ గా ఉంటాయి. ఎవరి గేమ్ వారు ఆడుతుంటారు. నచ్చినట్లు చేద్దామనుకుంటారు. కానీ ఇప్పుడు అవన్నీ కుదరవు అంటోంది హైకమాండ్. ఒకే లైన్ లో యూనిటీగా ముందుకు సాగాల్సిందే అని స్ట్రాంగ్ సిగ్నల్స్ పంపుతున్నారు. కష్టపడి పని చేసిన వాళ్లకు కచ్చితంగా పదవుల్లో న్యాయం జరుగుతుందన్న మాట వినిపిస్తున్నారు. హామీ ఇస్తున్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు కాంగ్రెస్‌కు ఇప్పుడు టెస్టింగ్ టైమ్ గా మారాయి. ఈ ఎన్నికల్లో నూటికి నూరు శాతం పంచాయతీలు, జడ్పీలను కైవసం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకైతే భారీ టాస్క్ ఇచ్చేశారు. ఈ టార్గెట్ రీచ్ అయ్యేందుకు కొన్ని జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులను మార్చడం, ముగ్గురు సీనియర్ మంత్రుల స్థానంలో కొత్తవారికి అవకాశం ఇవ్వడం వంటి స్ట్రాటజిక్ యాక్షన్స్ చేపట్టారు. ఈ చర్యలు ఎన్నికల్లో గెలుపు కోసం కీలకమన్న చర్చ జరుగుతోంది.

పటాన్ చెరులో గూడెం వర్సెస్ శ్రీనివాస్ గౌడ్

రాబోయే లోకల్ ఎన్నికలు ప్రభుత్వ పనితీరుకు అద్దం పట్టేవిగా ఉంటాయన్న వాదనను వినిపిస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పంచాయతీలు, జడ్పీలను దాదాపు క్లీన్ స్వీప్ చేసిన నేపథ్యంలో, కాంగ్రెస్ కూడా అదే స్థాయిలో విజయం సాధించాలని టార్గెట్ పెట్టుకుంది. ఈ బాధ్యత జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులతోపాటు ఎమ్మెల్యేలపై ఉందని హైకమాండ్ ఇప్పటికే స్పష్టం చేసింది. గెలుపు గుర్రాలను ఎంపిక చేసి టికెట్లు ఇవ్వడం ఈ ఎన్నికల్లో కీలకం అన్న సిగ్నల్స్ పంపించింది. అయితే ఇక్కడే చాలా ట్విస్టులు ఉన్నాయి మరి. కాంగ్రెస్‌లో ఇంటర్నల్ వార్ ఓ రేంజ్ లో నడుస్తోంది. ఇవి ఎన్నికల ఫలితాలపై ఏదైనా ఎఫెక్ట్ చూపుతాయా అన్న ఆందోళన పార్టీ నేతల్లో పెరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. స్టేషన్ ఘన్‌పూర్ నుంచి కడియం శ్రీహరి, భద్రాచలంలో తెల్లం వెంకట్రావు, చేవెళ్ల లో కాలె యాదయ్య, రాజేంద్రనగర్ లో ప్రకాశ్ గౌడ్, శేరిలింగంపల్లి అరికపూడి గాంధీ, ఖైరతాబాద్ %-% దానం నాగేందర్, బాన్సువాడ %-% పోచారం శ్రీనివాస్ రెడ్డి, జగిత్యాల డాక్టర్ సంజయ్, పటాన్‌చెరు గూడెం మహిపాల్ రెడ్డి, గద్వాల కృష్ణ మోహన్ రెడ్డి నియోజకవర్గాల్లో పాత, కొత్త నేతల మధ్య పొసగడం లేదు.

జగిత్యాలలో సంజయ్ వర్సెస్ జీవన్ రెడ్డి

ముఖ్యంగా పటాన్‌చెరులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత శ్రీనివాస్ గౌడ్ మధ్య ఘర్షణ ఉంది. అటు జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్‌తో మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి మధ్య వివాదం నడుస్తోంది. ఇద్దరూ ఒకే వేదికను అస్సలు పంచుకోవడం లేదు. గద్వాలలో ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డితో సరితా తిరుపతయ్య మధ్య అసమ్మతి ఉంది. ఖైరతాబాద్ లో ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో విజయా రెడ్డి మధ్య కోఆర్డినేషన్ సరిగా లేదంటున్నారు. ఈ విభేదాలు పార్టీ యూనిటీకి దెబ్బగా మారే ఛాన్సెస్ కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ నుంచి వచ్చిన ఎమ్మెల్యేలు తమ అనుచరులకే ప్రాధాన్యం ఇస్తున్నారని, పాత కాంగ్రెస్ కేడర్‌ను పట్టించుకోవడం లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, సీఎం రేవంత్‌కు ఫిర్యాదులు అందుతున్నాయి. అయితే ఇలా పార్టీ మారిన సందర్భాల్లో ఇలాంటివి కామనే. 2014 నుంచి పదవులు లేక ఆశలు కోల్పోయిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఇప్పుడు అధికారంలోకి రావడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్ల కోసం తీవ్రంగా పోటీ పడుతున్నారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఆశావాహులు ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతూ టికెట్ల కోసం ఒత్తిడి తెస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజామద్దతు, గెలుపు అవకాశాలున్న అభ్యర్థులను ఎంపిక చేయడం ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్ మంత్రులకు పెద్ద సవాల్‌గా మారింది. అయితే వీటికి కొంత గ్రౌండ్ వర్క్ చేస్తోంది కాంగ్రెస్ పార్టీ. ఇటీవల డీసీసీ అధ్యక్షుల నియామకం కోసం టీపీసీసీ ప్రత్యేక పరిశీలకులను నియమించి, ఫైనల్ లిస్ట్ తెప్పించినట్లే, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రత్యేక సర్వేల ద్వారా అభ్యర్థులను గుర్తించాలనే డిమాండ్ ఉంది. సీనియారిటీ, సామాజిక సమీకరణలను దృష్టిలో ఉంచుకుంటే రెబల్స్ సమస్య తగ్గుతుందని అనుకుంటున్నారు. ఈ ఫార్ములా ఎంత వరకు వర్కవుట్ అవుతుందో చూడాలి.

ఐక్యత కోసం మీనాక్షి నటరాజన్ సమావేశాలు

నేతలందరిలో యూనిటీ తీసుకురావడానికి చాలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పలుమార్లు సమన్వయ సమావేశాలు నిర్వహించినప్పటికీ, పాత, కొత్త నేతల మధ్య విభేదాలు తొలగలేదు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల్లో కూడా పార్టీ కేడర్ గ్రూపులుగా చీలిపోయి కనిపిస్తున్నాయి. జూబ్లీహిల్స్ నియోజకవర్గమే తీసుకుంటే అక్కడ కాంగ్రెస్ నుంచి గతంలో అజారుద్దీన్ పోటీ చేశారు. చాలా గ్రూప్ వార్ ఉంది. క్యాడర్ లో యూనిటీ లేదు. ఇంతలోనే అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే చనిపోవడంతో బైపోల్ రావడం ఖాయమైంది. ఈ గ్యాప్ లోనే కాంగ్రెస్ నుంచి ఎవరికి వారు పోటీ చేస్తామన్న వాదన పెరుగుతోంది.

అప్లికేషన్ పెట్టుకోవాలని, ఆ తర్వాత వడపోత ఉంటుందని, సీడబ్ల్యూసీ ఫైనల్ గా అభ్యర్థిని ప్రకటిస్తుందని అంటున్నారు. అటు లేటెస్ట్ గా తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు కీలక తీర్పు వెల్లడించింది. సెప్టెంబర్ 30వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. ఈ సందర్భంగా ప్రభుత్వం, ఎన్నికల సంఘం అభ్యర్థనలను సైతం పరిగణలోకి తీసుకుంది. ఈ ప్రకారం బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ఇచ్చిన హామీని పట్టాలెక్కించే పని పెట్టుకుంది. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల ప్రక్రియ చేపట్టాల్సి ఉందని, ఈ ప్రక్రియ పూర్తికావడానికి మరో నెల రోజుల గడువు అవసరమని కోర్టులో ప్రభుత్వం వివరణ ఇచ్చింది. వీటికి తోడు రిజర్వేషన్ల ప్రక్రియపై పార్టీ పరంగా ఎలా ముందుకెళ్లాలన్నది ఆలోచిస్తున్నారు.

కాంగ్రెస్ మెజార్టీ సీట్లు గెలవకపోతే విపక్షాలకు అడ్వాంటేజ్

స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ సాధించాలంటే, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేలు%ౌ% గెలుపు గుర్రాలను ఎంపిక చేయడం కీలకం. అదే సమయంలో అంతర్గత విభేదాలను పరిష్కరించుకోవడం అన్నిటికంటే ముఖ్యం. పాత, కొత్త నేతల మధ్య సమన్వయం ఇంకా ముఖ్యం. సర్వేల ద్వారా అసలైన అభ్యర్థుల్ని ఎంపిక చేయడం, సీనియారిటీకి ప్రాధాన్యం ఇవ్వడం, రెబల్స్ బెడద తగ్గించుకోవడం ఇవన్నీ కీ రోల్ పోషించబోతున్నాయి. వీటన్నిటికంటే ముఖ్యమైందంటేంటే.. లోకల్ బాడీ ఎలక్షన్లలో అధికార కాంగ్రెస్ పార్టీ పట్టు చూపించకపోతే ప్రతిపక్షాలకు అడ్వాంటేజ్ అవుతుంది. ప్రభుత్వంపై మరింత దాడి పెరుగుతుంది. అయితే ఆ అవకాశం ఇచ్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి రెడీగా లేరు. 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతు భరోసా ఇచ్చేశారు. సంక్షేమ పథకాల అమలు విషయంపై జనానికి పదే పదే వివరిస్తున్నారు. త్వరలోనే రాజీవ్ యువవికాసం కూడా ఉంటుందంటున్నారు.

# అగ్గి రాజేస్తోందా?

హైదరాబాద్,తెలంగాణలో బీఆర్ఎస్ కి జనాదరణ తగ్గుతుందన్నప్పుడల్లా సెంటిమెంట్ రాజేయడం ఆ పార్టీకి, ఆ పార్టీ నేతలకు అలవాటే. ఆ మాటకొస్తే తెలంగాణపై పేటెంట్ హక్కు తమదేనని హడావిడి చేస్తుంటారు గులాబీ నేతలు. మరి తెలంగాణ ఏర్పాటుకోసం కాంగ్రెస్ చేసిందేంటి..? కాంగ్రెస్ నాయకులు పదవుల్ని వదులుకోలేదా..? సీమాంధ్రలో పార్టీ చచ్చిపోతుందని తెలిసి కూడా కాంగ్రెస్ విభజన బిల్లు పార్లమెంట్ లో ప్రవేశ పెట్టి ఆమోదింపజేయలేదా..? తెలంగాణ ఏర్పాటులో ఎవరి కృషి ఎంత ఉన్నా.. అంతా తమదేనని చెప్పుకోవడం బీఆర్ఎస్ నేతలకు అలవాటే. అయితే ఇటీవల కాలంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలకు ప్రజలు పెద్దగా స్పందించడం లేదు. అభివృద్ధి కోరుకుంటున్నారు, అభివృద్ధికే జై కొడుతున్నారు. ఇక్కడే బీఆర్ఎస్ కి నష్టం వచ్చింది, కష్టం వచ్చిపడింది. అధికారం కోల్పోయిన తర్వాత పార్టీలో లుకలుకలు మొదలయ్యాయి. అన్న ఒకదారి, చెల్లి మరోదారి, మీమాంసలో మిగతా బంధుగణం అన్నట్టుగా తయారయ్యాయి బీఆర్ఎస్ ఇంటర్నల్ పాలిటిక్స్. ఈ క్రమంలో తాజాగా జాగృతి జెండాలు, అజెండాలు, కండువాలతో బయటకొస్తున్న ఎమ్మెల్సీ కవిత మరోసారి సెంటిమెంట్ రాజేసే ప్రయత్నాలు చేస్తున్నారు. ఏపీని తిడితే, ఏపీ నాయకుల్ని కామెంట్ చేస్తే, తెలంగాణలో తమ క్రేజ్ పెరుగుతుందనే భ్రమల్లో ఉన్నారు కవిత. అందుకే ఆంధ్రోళ్ల బిర్యానీ అంటూ సెటైర్లు పేల్చారు.

ఆంధ్రా చేపల పులుసు..

ఆంధ్రోళ్ల బిర్యానీ మనమేం తింటం? ఆంధ్రా బిర్యానీ ఎలా ఉంటదో కేసీఆర్ సార్ చెప్పిండు కదా.,. అంటూ ప్రెస్ మీట్లో వ్యాఖ్యానించారు కవిత. బనకచర్ల ప్రాజెక్ట్ గురించి మాట్లాడుతూ ఆమె ఈ వ్యాక్యలు చేశారు. ఏపీ సీఎం చంద్రబాబుకి వ్యతిరేకంగా మాట్లాడేందుకు భయపడి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బనకచర్లపై సైలెంట్ అయ్యారని ఆరోపించారు కవిత. ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీ తర్వాత బనకచర్లకు గ్రీన్ సిగ్నల్ వచ్చిందని ఆమె చెప్పారు. అయితే కవిత వ్యాఖ్యలపై నెటిజన్లు ఓ రేంజ్ లో మండిపడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ చేసిందేంటని నిలదీస్తున్నారు నెటిజన్లు. అప్పట్లో వైసీపీ నేత రోజా ఇంటికి వెళ్లిన కేసీఆర్ ఏం మాట్లాడారో కవితగు గుర్తు లేదా అని కౌంటర్లిస్తున్నారు. ఆంధ్రా చేపల పులుసు అంత ఇష్టంగా తిన్న కేసీఆర్, ఆంధ్రోళ్ల బిర్యానీ గురించి కామెంట్ చేశారంటూ కవిత చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

ఢిల్లీ లిక్కర్ సంగతేంటి..?

ఆంధ్రోళ్ల బిర్యానీ సంగతి సరే మరి ఢిల్లీ లిక్కర్ సంగతేంటని కవితను సోషల్ మీడియాలో నిలదీస్తున్నారు నెటిజన్లు. తెలంగాణ లిక్కర్ ఇష్టంలేకే ఢిల్లీ లిక్కర్ దందాలో మునిగితేలారా అంటూ ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలకు పదవులు లేకపోతే.. ఆంధ్రా బిర్యానీ, ఆనపకాయ, యాస, జాతి, భాష అర్జెంటుగా గుర్తుకు వచ్చేస్తాయంటూ ఒకరు కామెంట్ పెట్టారు. "గత 11 ఏళ్లలో మీరు మీ కుటుంబ సభ్యులు ఆంధ్రోళ్ళ ఇళ్ళలో, పెళ్లిళ్లలో, ఇతర శుభకార్యాలలో భోజనం చేసిన సందర్భాలు ఒక్క సారి గుర్తుతెచ్చుకోండి మేడం" అంటూ మరొకరు కామెంట్ పెట్టారు. ఇక బీఆర్ఎస్ పేరు మార్చాలంటూ మరో నెటిజన్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ పేరు భారత రాష్ట్ర సమితిగా ఉండటానికి వీల్లేదన్నారు. ఆంధ్ర ప్రాంతంపై అక్కసు వెళ్లగక్కుతున్న ఆ పార్టీ నేతలు, ఆంధ్రా రహిత భారత రాష్ట్ర సమితి అనే పేరు పెట్టుకోవాలంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

# ఐదు దేశాల పర్యటనకు ప్రధాని మోదీ !



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెల జూలై 2 నుండి 9 వరకు ఐదు దేశాల పర్యటనకు వెళ్లనున్నారు. ప్రపంచ దక్షిణ దేశాలతో భారతదేశం సంబంధాలను బలోపేతం చేయడానికి ఈ పర్యటనలో ప్రధాని మోదీ ఘనా, ట్రినిడాడ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్ నమీబియాలను సందర్శించనున్నారు.

పర్యటన షెడ్యూల్ !

జూలై 2-3 : ఘనా-ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణ
జూలై 3-4 : ట్రినిడాడ్ & టొబాగో-పార్లమెంట్ ప్రసంగం, డయాస్పోరా భేటి
జూలై 4-5 : అర్జెంటినా-వ్యూహాత్మక రంగాలలో సహకారం
జూలై 5-8 : బ్రెజిల్-BRICS సదస్సు, ద్వైపాక్షిక చర్చలు
జూలై 9 : నమీబియా-పార్లమెంట్ ప్రసంగం, పునరుత్పాదక సహకారం

ఘనా (జూలై 2-3) :

ప్రధాని పర్యటన ఘనాలో జూలై 2-3 తేదీలలో ప్రారంభమవుతుండగా గత 30 సంవత్సరాలలో ఘనాకు వెళ్తున్న తొలి భారత ప్రధాని పర్యటన కావడం విశేషం. ఇరుదేశాల మధ్య అభివృద్ధి సహకారం, విద్య, రక్షణ, ఇంధన రంగాలలో భాగస్వామ్యాన్ని మెరుగుపర్చే దిశగా చర్చలు జరుగుతాయి.

ట్రినిడాడ్ అండ్ టొబాగో (జూలై 3-4)

%1999 తర్వాత ట్రినిడాడ్ అండ్ టొబాగో కి వెళ్లిన తొలి భారత ప్రధాని పర్యటనగా గుర్తింపు పొందుతోంది. మోదీ అక్కడ పార్లమెంట్ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా ఇండియన్ డయాస్పోరాతో కూడా సమావేశం జరుగుతుంది.

అర్జెంటినా (జూలై 4-5)

%ప్రధాని మోదీ, అర్జెంటినా అధ్యక్షుడు జవియర్ మిలీతో కలిసి వ్యూహాత్మక రంగాలలోకృషి, రక్షణ, మైనింగ్, శక్తి, అంతరిక్ష రంగాలలోభారత-అర్జెంటినా సంబంధాలను బలోపేతం చేయడం లక్ష్యంగా చర్చలు జరుపనున్నారు.

బ్రెజిల్ (జూలై 5-8) - BRICS సదస్సు !

మోదీ బ్రెజిల్ లోని రియో డి జెనెరోలో జరిగే 17వ BRICS సదస్సులో పాల్గొంటారు. ఈ సదస్సులో బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా, భారత నేతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, గ్లోబల్ టెర్రరిజం, వాతావరణ మార్పులు, బహుపాక్షిక వ్యవస్థలలో సంస్కరణలపై చర్చిస్తారు. అనంతరం బ్రాసీలియాలో బ్రెజిల్ అధ్యక్షుడు లూయిస్ ఇన్నాసియో లులా డా సిల్వాతో ద్వైపాక్షిక చర్చలు జరుగుతాయి.

నమీబియా (జూలై 9)

చివరిగా జూలై 9న నమీబియా పర్యటన జరుగుతుంది. నమీబియాకు మోదీ తొలి పర్యటన. ప్రధాని మోదీ అక్కడి అధ్యక్షురాలు నెటుంబో నాండీ-న్డైట్వాను కలుసుకుంటారు, స్వాతంత్ర్య పోరాట నాయకుడు సామ్ నుజోమా స్మారక స్థలానికి నివాళులు అర్పిస్తారు, నమీబియా పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తారు. భారత్-నమీబియా మధ్య పునరుత్పాదక శక్తి, వన్యప్రాణుల సంరక్షణ రంగాలలో సహకారం ప్రధాన అంశాలుగా ఉంటాయి. ఈ పర్యటనతో భారతదేశం అభివృద్ధి, భద్రత, అంతర్జాతీయ ఆర్థిక పాలనలో తన పాత్రను మరింతగా ఆవిష్కరించనుంది. గ్లోబల్ సౌత్ దేశాలకు భారత్ దృఢ మద్దతును తెలిపే ఈ పర్యటన, భవిష్యత్ సౌహార్ధభరిత సంబంధాలకు గట్టి పునాదులు వేస్తుందని అంచనా.

# అంతర్జాతీయ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్ భూకేటాయింపు రద్దు..



హైదరాబాద్ : హైదరాబాద్‌లోని అంతర్జాతీయ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కు అత్యంత విలువైన ప్రాంతంలో చేసిన భూ కేటాయింపులను తెలంగాణ హైకోర్టు రద్దు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో జారీ చేసిన జీఓలను కొట్టివేస్తూ శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేటాయింపు నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి మండలం రాయదుర్గం లో గల సర్వే నెంబరు 83/1లో 3.5 ఎకరాలకు పైగా భూమిని ఐఏఎంసీకి కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐటీ కారిడార్‌లో ఉన్న ఈ భూమి విలువ సుమారు రూ. 350 కోట్లు ఉంటుందని అంచనా. అయితే, ప్రభుత్వ భూమిని ఒక ప్రైవేట్ సంస్థకు కేటాయించడం చట్టవిరుద్ధమని న్యాయవాది కె.రఘునాథ్‌రావు, వెంకటరామ్‌రెడ్డి వేర్వేరుగా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.సుజనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ చేపట్టింది. న్యాయవాది రఘునాథ్‌రావు వాదనలు వినిపిస్తూ, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా, నిబంధనలను అతిక్రమించి ప్రభుత్వం ఈ కేటాయింపులు జరిపిందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు, ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించారు. హైదరాబాద్‌లో ఐఏఎంసీ ఏర్పాటు వల్ల అంతర్జాతీయ వాణిజ్య వివాదాల పరిష్కారం సులభతరం అవుతుందని తెలిపారు. న్యాయస్థానాల వెలుపల వివాదాలు పరిష్కారమవ్వాలని కోర్టులే ప్రోత్సహిస్తున్నాయని, దీనివల్ల న్యాయవ్యవస్థపై భారం కూడా తగ్గుతుందని ఆయన తెలిపారు. ఇరుపక్షాల వాదనలు ఈ ఏడాది జనవరిలోనే ముగియడంతో, ధర్మాసనం తీర్పును రిజర్వులో ఉంచింది. తాజాగా శుక్రవారం తుది తీర్పును వెలువరిస్తూ, ఐఏఎంసీకి భూమిని కేటాయించడంతో పాటు, దాని ప్రస్తుత భవన నిర్వహణ కోసం జారీ చేసిన జీఓలను సైతం పూర్తిగా కొట్టివేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ తీర్పుతో ఐఏఎంసీ కి రాష్ట్ర ప్రభుత్వం చేసిన భూ కేటాయింపులు రద్దయ్యాయి.

# కవిత ఎవరు? బీసీనా? ఇంకోసారి ఆ పేరు ఎత్తకుండా..



హైదరాబాద్,బీసీలకు బ్రాండ్ అంబాసిడర్ గా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేస్తున్న విన్యాసాలు అందరికీ తెలిసినవే. బీఆర్ఎస్ 9 ఏళ్లు తెలంగాణలో అధికారంలో ఉన్నప్పుడు జ్యోతిబా పూలే పేరు కూడా ఎత్తని కవిత, అధికారం పోగానే, అసెంబ్లీ ఆవరణలో ఆయన విగ్రహం ఏర్పాటు చేయాలంటూ రాగం తీస్తున్నారు. బీసీ మంత్రం జపిస్తున్నారు. కవిత డబుల్ గేమ్ పై ఓ రేంజ్ లో ధ్వజమెత్తారు బీజేపీ నేత రఘునందన్ రావు. అసలు కవిత ఎవరు, బీసీనా అంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు.కవిత ఎవరు ? ఆమె బీసీ సామాజిక వర్గానికి చెందిన లీడరా బీఆర్ఎస్ హయాంలో బీసీలకు కేసీఆర్ చేసిన ద్రోహానికి చింతిస్తూ కవిత లెంపలు వేసుకోవాలి. ఆమె బోధించడం కంటే ముందు ఆచరించడం నేర్చుకోవాలి

బీసీలకు ఏమిచ్చారు..?

బీసీలకు మద్దతుగా వస్తున్న కవిత కానీ, ఆమె పార్టీ కానీ అసలు బడుగు బలహీన వర్గాలకు ఏం చేసిందంటూ ప్రశ్నించారు రఘునందన్ రావు. బీఆర్ఎస్ లో ఎప్పుడూ బీసీలకు అన్యాయమే జరిగిందని విమర్శించారు. కవితకు బీసీలపై అంత ప్రేమ ఉంటే అధికారంలో ఉన్నప్పుడు పదవులు ఎందుకివ్వలేదన్నారు. బీసీ మంత్రుల్ని సైతం అవమానించి పార్టీనుంచి బయటకు పంపేశారని చెప్పారు. పార్టీ అధ్యక్ష పదవి బీసీలకిచ్చారా, కనీసం సీఎల్పీ నేత పదవి అయినా బీసీలకిచ్చారా అంటూ లాజిక్ తీశారు. బీఆర్ఎస్ హయాంలో బీసీలకు కేసీఆర్ చేసిన ద్రోహానికి చింతిస్తూ కవిత లెంపలు వేసుకోవాలన్నారు. గన్ పార్క్ నుంచి నడుచుకుంటూ వెళ్లి అమర వీరుల విగ్రహాల వద్ద నిలబడి క్షమాపణలు అడగాలన్నారు. పార్టీకి సంబంధించిన ఏ పదవి కూడా బీసీలకు ఇవ్వకుండా, వారిని ఎదగనీయకుండా చేశారని మండిపడ్డారు.

ఆచరించడం నేర్చుకో..

అంబేద్కర్ చెప్పినట్టు బోధించడం కంటే ముందు కవిత ఆచరించడం నేర్చుకోవాలన్నారు రఘునందన్ రావు. బీసీలకు అన్యాయం జరుగుతోందని మొసలి కన్నీరు కారుస్తున్న కవిత, అసలు బీఆర్ఎస్ తరపున బీసీలకోసం ఏం చేశారని నిలదీశారు. వాస్తవానికి బీసీలను అవమానించిన పార్టీ బీఆర్ఎస్ అని చెప్పారు. అధికారం పోగానే ఇప్పుడు కవితకు బీసీలు కావాల్సి వచ్చారని, ఇప్పుడు కూడా కేవలం రాజకీయాలకోసమే బీసీల పేరుని వాడుకోడానికి ఆమె ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో బీసీలకు ఏం న్యాయం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీలకోసం వస్తున్న కవితను వారంతా నిలదీయాలన్నారు.

బిర్యానీపై విమర్శలు..

బీసీల తరపున మాట్లాడుతూ తన ద్వంద్వ వైఖరి బయటపెట్టుకుంటున్న కవిత, ఇటీవల ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేలా ఆంధ్రోళ్ల బిర్యానీ అనే వ్యాఖ్యలు చేశారు. కవిత కామెంట్లపై సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ నడుస్తోంది. ఆమెకు ఆంధ్రోళ్ల బిర్యానీ ఏం నచ్చుతుందని, తీహార్ జైలులో చిప్పకూడు రుచిగా ఉంటుందని ట్రోల్ చేస్తున్నారు నెటిజన్లు. అటు తెలంగాణ వైపు నుంచి కూడా కవిత వ్యాఖ్యలపై ఎక్కడా స్పందన లేదు. అధికారం లేనప్పుడు ప్రాంతీయ, కుల విద్వేషాలు రెచ్చగొట్టడం బీఆర్ఎస్ నేతలకే చెల్లిందని అంటున్నాయి ప్రత్యర్థి పార్టీలు. కవితకు చిత్తశుద్ధి ఉంటే, ముందు పార్టీ ప్రెసిడెంట్ పదవి కానీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కానీ బీసీలకు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు నేతలు. పార్టీలో లుకలుకలను కవర్ చేసేందుకు కవిత పదే పదే మీడియా ముందుకొస్తున్నారు. బీఆర్ఎస్ తరపున వకాల్తా పుచ్చుకుని మాట్లాడుతున్నా, ఆమె వెంట బీఆర్ఎస్ కండువా కప్పుకున్న నాయకులెవరూ కనపడ్డంలేదు. జాగృతి పేరుతో జండాలు, కండువాలతో ఆమె రాజకీయం చేస్తున్నారు.

# స్థానిక ఎన్నికలు సజావుగా సాగుతాయా?



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో ఉష్ణోగ్రతలు వేగంగా పెరుగుతున్నాయి. ఓ వంక ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసు దుమారం రేపుతుంటే.. మరో వంక గత బీఆర్ఎస్ ప్రభుత్వ, 'ఘన' చరిత్రకు అద్దం పట్టే, ప్రతిష్టాత్మక' కాళేశ్వరం ప్రాజెక్ట్, ఫార్ములా - ఈ కార్ రేస్ ఇతరత్రా అవినీతి కేసులు, రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి. ఏ రోజుకు ఆరోజు కొత్త మలుపులు తీసుకుంటున్నాయి. అదొకటి అలా ఉంటే.. అన్ని పార్టీలకూ, మరీ ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీకి అగ్ని పరీక్ష కానున్న స్థానిక సంస్థల ఎన్నికలు తరుముకొస్తున్నాయి. 2019లో ఎన్నికల్లో కొలువు తీరిన స్థానిక సంస్థలు కాలం చేసి, సంవత్సరం పైగానే అయినది. అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇదిగో అదిగో అంటూ.. స్థానిక ఎన్నికలను ఎప్పటికప్పుడు వాయిదా వేస్తూ వచ్చింది. అయితే.. ఇక ఇప్పుడు తప్పించుకునే అవకాశం లేకుండా రాష్ట్ర హై కోర్టు ఎన్నికలను పదేపదే వాయిదా వేయడాన్ని తప్పుపడుతూ, సర్కార్ నెత్తిన అక్షితలు వేయడంతో పాటుగా , 90 రోజుల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించి తీరాలని ప్రభుత్వానికి గడవు విధించిది. ఈ నేపథ్యంలో ఇప్పుడు ప్రభుత్వానికి ఎన్నికలు నిర్వహించడం మినహా మరో మార్గం లేకుండా పోయింది. రాష్ట్ర హై కోర్టు విధించిన 90 రోజుల గడువు ముగిసేలోగా ఎన్నికలు నిర్వహించక తప్పని పరిస్థితి ఏర్పడింది. మరో వంక ఎటు తేలని బీసీ రిజర్వేషన్ వ్యవహారం, సర్కార్ కు తలనొప్పిగా మారింది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు అన్నీ కలిపి 50 శాతం మించకూడదని సుప్రీం కోర్టు తీర్పు ఉన్నది. ఈ పీటముడిని విప్పితేగానీ ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగే పరిస్థితి లేదు. అయితే.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం మనసులో ఏముందో ఏమో కానీ.. ఈరోజుకు కూడా రిజర్వేషన్లపై ఎటూ తేల్చకుండా నాన్చివేత ధోరణి అవలబిస్తోంది. అదలా ఉంటే 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన తర్వాతనే ఎన్నికలకు వెళ్ళాలని, లేదంటే.. అంటూ బీసీ సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ఇలా ఎటు చూస్తే అటు పటు నిరాశ అన్నట్లుగా కాంగ్రెస్ పార్టీ, కాంగ్రెస్ ప్రభుత్వం చిక్కుల్లో చిక్కుందని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు.అదొకటి అయితే.. ఏదో ఒకటి చేసి, కోర్టు ఆదేశాల ప్రకారం, 90 రోజుల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించినా.. ఫలితాలు ఎలా ఉంటాయి అనే విషయంలో అధికార పార్టీలో అనుమనాలు తొలగడం లేదని అంటున్నారు. కాంగ్రెస్ ముఖ్యనాయకులు, పొరుగు రాష్ట్రం మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి స్టైల్లో స్థానిక ఎన్నికలను స్వీప్ చేస్తామని చెపుతున్నా.. పార్టీ అంతర్గత సర్వేల ఫలితాలు అందుకు భిన్నంగా ఉన్నాయని అంటున్నారు. ఫలితాలు కూడా అలాగే ఉంటాయనే భయాన్ని వ్యక్త పరుస్తున్నారు.నిజానిజాలు ఎలా ఉన్నప్పటికీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్ల ప్రజల్లోనే కాదు.. పార్టీలోనూ వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు సష్టంగా వ్యాఖ్యానిస్తున్నారు. నిజానికి ముఖ్యమంత్రికే తమ మంత్రుల పనితనం మీద విశ్వాసం లేదని, ఇక ప్రజలకు ప్రభుత్వం పై విశ్వాసం ఎలా ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు. నిజంగా కూడా సామాన్య ప్రజలు.. ముఖ్యంగా 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం స్వచ్ఛందంగా పనిచేసిన వివిధ వర్గాల ప్రజలు.. ముఖ్యంగా నిరుద్యోగ యువత, పేద మహిళలు, మధ్యతరగతి, దిగువ మధ్య తరగతి మహిళలు కూడా.. కాంగ్రెస్ పార్టీని సొంత చేసుకునేదుకు, సమర్ధించేందుకు సిద్ధంగా లేరని అంటున్నారు. ముఖ్యంగా.. మహిళలకు ఇచ్చిన ప్రత్యేక హామీలు ఏవీ అమలు కాకపోవడంతో మహిళల్లో ప్రభుత్వ వ్యతిరేకత చాలా ఎక్కువ ఉందని అంటున్నారు. స్థానిక ఎన్నికలో మహిళా వ్యతిరేకత ప్రభావం భారీగా ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు. అలాగే.. ఎన్నికల హామీల అమలు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలు, ముఖ్యంగా ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలు విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న సాచివేత ధోరణి, రుణ మాఫీ, రైతుభరోసా సహా ఏ ఒక్క పథకాన్ని సంతృప్తి కరంగా పూర్తి చేయక పోవడంతో అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి తారస్థాయికి చేరిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో,కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టు ఆదేశాలను పాటించి ఎన్నికలకు వెళుతుందా? అన్న అనుమానాలు కూడా విపక్షాలు వ్యక్త పరుస్తున్నాయి. అయితే.. ప్రభుత్వం ఎన్నికలు మరో సారి వాయిదా వేసే ఆలోచన చేయక పోవచ్చని అంటున్నారు. అదే సమయంలో ప్రభుత్వం స్థానిక ఎన్నికలను సజావుగా నిర్వహిస్తుందా? లేక, ఏపీలో జగన్ రెడ్డి నిర్వహించిన అరాచక, అప్రజాస్వామిక పద్దతిలో మమ అనిపిస్తుందా అనే అనుమానాలు అందరిలో ఉన్నాయని అంటున్నారు.

# తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడు ఎవరు?





ఢిల్లీ: తెలంగాణ రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడు నియామకానికి సమయం ఆసన్నమైంది. మరికొద్ది రోజుల్లో తెలంగాణ బీజేపీకి నూతన అధ్యక్షుడు రాబోతున్నారనేది ప్రస్తుతం చర్చనీయాంశమైంది. మరో మూడు నెలల్లోపే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న తరుణంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిపై అధిష్ఠానం తీవ్రంగా దృష్టి సారించింది. ప్రస్తుతం తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న కిషన్‌రెడ్డి స్థానంలో మరొకరి పగ్గాలు అప్పగించేందుకు ఇప్పటికే అధిష్టానం సిద్ధమైనట్లు తెలుస్తోంది. తెలంగాణ బీజేపీ నూతన అధ్యక్షుడి రేసులో ఈటల రాజేందర్‌తో పాటు ధర్మపురి అరవింద్‌లు ముందు వరుసలో ఉన్నట్లు సమాచారం. దీనిపై అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు, వచ్చే నెల ఒకటో తేదీనే ప్రకటించే అవకాశం ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. దీనిలో భాగంగా ఈనెల 30వ తేదీన నామినేషన్ల ప్రక్రియ జరగనుంది. అదే సమయంలో ఏపీ బీజేపీ నూతన అధ్యక్షుడి నియామకం కూడా జరగనుంది. ఈ రెండు నామినేషన్ల ప్రక్రియ ఈనెల చివరన నిర్వహించే జూలై 1వ తేదీన కొత్త అధ్యక్షుల్ని ప్రకటించే యోచనలో ఉన్నారు. తెలంగాణ బిజెపి ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా శోభ కరండ్లాంజె నియమించగా, ఏపీ బీజేపీ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా పీసీ మోహన్‌ను నియమించారు.

**సమస్యలపై స్పందించకుంటే 30న ధర్నా..జూడాల ప్రకటన**

హైదరాబాద్,తమ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం, వైద్యారోగ్య శాఖ మంత్రి స్పందించకపోవడంతో ఈ నెల 30 నుంచి ధర్నా చేపట్టనున్నట్టు తెలంగాణ జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ నేతలు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం టీ జూడాల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇసాక్ న్యూటన్ ఓ ప్రకటన విడుదల చేశారు. స్టైఫండ్ చెల్లింపులో జాప్యం, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడం,

# దేనికైనా కాళేశ్వరం లింక్ కలిపేస్తున్న కేటీఆర్



హైదరాబాద్,కాళేశ్వరం ప్రాజెక్టు అంశం కేటీఆర్ ను బాగా డిస్ట్రబ్ చేస్తున్నట్లుగా ఉంది. ఏ విషయం జరిగినా కాళేశ్వరం లింక్ పెడుతున్నారు. తాజాగా జూరాల ప్రాజెక్టులో గేట్లకు సంబంధించిన తాళ్లు తెగిపోవడం, హైదారబాద్ శివారులో మంజీరా బ్యారేజీ నుంచి నీళ్లు లీక్ అవుతున్నాయని ఫోటోలు బయటకు రావడంతో చాలా పెద్ద ట్వీట్ పెట్టారు. అంత పెద్ద ట్వీట్ ఎందుకంటే.. కాళేశ్వరంలో మేడిగడ్డ బ్యారేజీలో వచ్చిన పగుళ్లు.. దీనికి పెద్ద తేడా లేదని చెప్పడానికి. భారీ వరద వచ్చిన ప్పుడు ప్రాజెక్టులకు ఇలా జరుగుతూ ఉంటాయని.. ప్రభుత్వాలు వెంటనే రిపేర్లు చేయించాలని అంటున్నారు. మేడిగడ్డకు రిపేర్లు చేయించకపోవడంపై మండిపడ్డారు. జూరాలతో పాటు అన్ని ప్రాజెక్టులకు రిపేర్లు చేయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నిర్వాకంతో ప్రాజెక్టులకు గడ్డు పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఇటీవల .. మధ్యప్రదేశ్ లో ఓ బ్రిడ్జి, బీహార్‌లో ఓ వాచ్ టవర్ నిర్మాణాలను కూడా కాళేశ్వరంతో పోల్చి చూశారు కేటీఆర్. ఆయన కాళేశ్వరం లో జరిగిన తప్పిదం చాలా చిన్నదని చెప్పడానికి.. అలాంటివన్నీ జరుగుతూ ఉంటాయని నార్మలైజ్ చేయాలని అనుకుంటున్నారు. అందుకే ఎలాంటి ఘటన జరిగినా కాళేశ్వరం లింక్ పెట్టి .. సహజమేనని చెబుతున్నారు .మేడిగడ్డ బ్యారేజీ.. ఎన్నికలకు ముందు కుంగిపోవడం బీఆర్ఎస్ పార్టీకి పెను సమస్యగా మారింది. లక్ష కోట్ల ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అది చాలా చిన్న సమస్య అని. రిపేర్ చేయించాలని బీఆర్ఎస్ అంటోంది. కానీ ఆ బ్యారేజ్ కుంగిపోయినంత వరకూ తీసేసి మళ్లీ నిర్మించాని ఎన్డీఎస్ఏ రిపోర్టు ఇచ్చింది. మరో వైపు కాళేశ్వరం అక్రమాలపై విచారణ జరుగుతోంది. అన్నీ కలిసి కేటీఆర్ కు కాళేశ్వరం టెన్షన్ పట్టుకునేలా చేసిందని ఆయన ట్వీట్లు నిరూపిస్తున్నాయని కాంగ్రెస్ వర్గాలు సెటైర్లు వేస్తున్నాయి.

## చంద్రబాబు విజనరీ లీడర్

విశాఖపట్నం,యోగాంధ్ర కార్యక్రమంతో సరికొత్త రికార్డు సాధించామని.. స్వయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ యోగాంధ్రలో పాల్గొని విజయవంతం చేశారని బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య ఉద్ఘాటించారు. మోదీ, చంద్రబాబు నాయకత్వంలో ఏపీ అభివృద్ధి సాధిస్తోందని వెల్లడించారు. రానున్న రోజుల్లో ఏపీ మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలో బీజేపీ కూటమి ప్రభంజనం సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేశారు బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య.

# కాంగ్రెస్ నేత డీఎస్" విగ్రహాన్ని ఆవిష్కరించనున్న అమిత్ షా !



హైదరాబాద్,కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలంగాణ పర్యటనకు వస్తున్నారు. ఆదివారం నిజామాబాద్ లో ఏర్పాటు చేసిన పసుపుబోర్డు ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రధానమైన హామీ ఈ పసుపుబోర్డు. గత ఎన్నికలకు ముందు ప్రధాని మోదీ ప్రకటించి.. వెంటనే కేంద్రం నుంచి ఉత్తర్వులు రిలీజ్ చేయించారు. ఇప్పుడు కార్యాలయం ప్రారంభోత్సవానికి అమిత్ షాను ఆహ్వానించారు.ప్రత్యేకమైన ఇతర కార్యక్రమాలేవీ లేవు కానీ.. ధర్మపురి అర్వింద్ తన తండ్రి డీఎస్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి..దాన్ని అమిత్ షాతో ఆవిష్కరింప చేస్తున్నారు. ఇది రాజకీయవర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ఎందుకంటే ధర్మపురి శ్రీనివాస్ అలియాస్ డీఎస్ ఎప్పుడూ బీజేపీలో లేరు. కాంగ్రెస్ పార్టీకి సీనియర్ నేతగా ఉన్నారు. రెండు సార్లు పీసీసీ చీఫ్ గా చేశారు. మంత్రిగా చేశారు. కాంగ్రెస్ దగ్గర ఏమీ లేదని అనుకున్న తర్వాత ఆయన బీఆర్ఎస్ లో చేరారు. అక్కడ రాజ్యసభ సీటు ఇచ్చారు. అయితే ఆయన తర్వాత మళ్లీ కాంగ్రెస్ కు దగ్గరయ్యారు. కానీ అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో చేరలేదు.ఆరోగ్యం క్షీణించడంతో ఇక ఎలాంటి రాజకీయాలు చేయలేదు. సుదీర్ఘ కాలం అనారోగ్యంతో బాధపడి చనిపోయారు. ఆయన కుమారుడు ధర్మపురి అర్వింద్ కాంగ్రెస్ పార్టీతో కాకుండా బీజేపీతో రాజకీయ పయనం ప్రారంభించారు. ఇప్పటికి రెండు సార్లు ఎంపీగా గెలిచారు. తండ్రి సిద్ధాంతాలు వేరైనప్పటికీ.. బీజేపీతో ఎలాంటి సంబంధం లేనప్పటికీ.. అమిత్ షాతో తండ్రి విగ్రహాన్ని ఆవిష్కరింప చేయడం ఆయన రాజకీయ చాతుర్యం అంటున్నారు. డీఎస్ పై ఇప్పుడు కాషాయ ముద్ర పడుతుందని అంటున్నారు.

Printed, Published & Owned by MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001, Published From SPOORTHI PUBLICATIONS, H.No: 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Dist: Nalgonda, State Telangana. Pin: 508001 Editor: MEDE SHANTHI KUMAR.